ఊరేగిన నరసింహుడు



తనివితీరా స్నానం చేసి..కనులారా స్వామిని చూసి.. మనసారా దర్శించుకున్నారు.. అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది..లక్ష్మీ నరసింహుడికి ఆలయం నుంచి పెద్ద ఎత్తున భక్తజనం మధ్య రథం కదిలింది.. స్వామిని భక్తజనం ఓం నమో నారసింహాయ అంటూ ఊరంతా కలియతిప్పారు.. తమ చెంతకు వచ్చిన స్వామిని దర్శించుకుని భక్తజనం తన్మయత్వం చెందారు.. స్వామికి హారతులు పట్టారు.. కాపాడు స్వామి అంటూ వేడుకున్నారు.. - 6లో





కల్యాణ..భీమేశ్వరుడు

బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామంలో భీమేశ్వరుడి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ముందుగా ఉత్సవమూర్తులకు మంగళస్నానం జరిపించారు. మూలవిరాట్ భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ, క్షేత్ర పాలకులు శ్రీలక్ష్మీ సమేత నారాయణస్వామి, శ్రీ చండికా సమేత సూరేశ్వరస్వామికి శనివారం రాత్రి 11:05 గంటలకు కల్యాణం జరిపించారు.. పెద్ద ఎత్తున హాజరైన భక్తజనం ఆసక్తిగా కల్యాణక్రతువు తిలకించారు.. ఓం నమో భీమేశ్వరాయ అంటూ కొలిచారు.. - 7లో

వాట్సప్‌లో హాయ్ అని పెడితే..
ఆర్టీసీ టికెట్

నిడదవోలు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : వాట్సప్ నుంచి ఏదైనా చేయవచ్చు.. ప్రభుత్వ పౌర సేవలే కాదండోయ్..ఆర్టీసీ టిక్కెట్లు బుక్‌చేసుకోవచ్చు. 9552300009 అనే వాట్సప్ నెంబరుకు హాయ్ అనే మెసేజ్ చేస్తే ఆర్టీసీ సేవలు అందుబాటులోకి వస్తాయి. దీని ద్వారా ప్రయాణికులు చేరవలసిన ప్రదేశానికి టికెట్‌ను డిజిటల్ మనీ చెల్లింపు ద్వారా బుక్ చేసుకోవచ్చు. అనంతరం మీరు ఇచ్చిన నెంబర్‌కు బస్ టికెట్ వాట్సప్‌లో వస్తుంది.ప్రభుత్వం ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యార్థం వాట్సప్ ద్వారా టికెట్ బుకింగ్ సేవలను అందుబాటులోకి తెచ్చిందని నిడదవోలు డీఎం కె.వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. సేవలను ప్రయాణికులు సద్వినియోగపర్చుకోవాలన్నారు.



పాండవుల మెట్టపై భక్తుల పూజలు

రంపయర్రంపాలెంలో పాండవుల తీర్థం

గోకవరం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి) : భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని రంపయర్రంపాలెంలో పాండవుల తీర్థం శనివారం ప్రారంభమైంది. పాండవుల మెట్టపై గుహల్లో ఉన్న ద్రౌపతిదేవి, పాండవుల విగ్రహాలకు ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ తీర్థం కోసం పాం డవుల మెట్టను నిర్వాహకులు సర్వాంగా సుందరంగా తీర్చిదిద్దారు.తీర్థానికి ఎక్కడెక్కడి నుంచో భక్తజనం తరలి వస్తారు. ఉత్సవాల్లో భాగంగా పాండవుల మెట్ట చుట్టూ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు పాండవుల విగ్రహాలను దర్శించుకున్నారు.అన్నదాన నిమిత్తం రూ. 1,11,000 విరాళం అందజేశారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.

బాలికను వేధిస్తున్న యువకుడిపై పోక్సో కేసు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): బాలికను వేధింపులకు గురిచేస్తున్న యువకుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. శాంతినగర్‌కి చెందిన బుంగా సతీశ్ ప్రతి రోజూ అదే వీధికి చెందిన ఓ బాలిక (15) వెంటపడి వేధిస్తున్నాడు. బాలిక తల్లి ఎన్నిసార్లు హెచ్చరించినా పట్టించుకోవడంలేదు. దీంతో ఆమె శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశామని సీఐ అప్పారావు తెలిపారు.

కిలోతో పట్టుబడినా.. పదేళ్లు!

గంజాయి కేసులో చిక్కితే.. జీవితం జైలుకే



గంజాయి ఎక్కడ పట్టుబడినా మూలాలు మాత్రం తూర్పువే.. ఎందుకంటే గంజాయి ఎక్కువగా సాగయ్యేది తూర్పు ఏజెన్సీలోనే.. ఇక్కడి నుంచే దేశవ్యాప్తంగా సరఫరా చేస్తున్నారు.. కేసుల్లో నిందితులుగా ఉన్నవారు మన జిల్లాకు చెందిన వారే ఎక్కువ.. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులోనే గంజాయి కేసుల్లో చిక్కిన 400 మంది వరకూ ఉన్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇప్పటి వరకూ ఎన్‌డీపీఎస్ యాక్ట్ ఉన్నా చూసీచూడనట్టు వదిలేస్తున్నారు.. గంజాయి కేసులో చిక్కినా బెయిల్‌పై బయటకు వచ్చేసి తిరుగుతున్నారు.. ఇక నుంచి అలా కుదురదు.. గంజాయి కేసులో చిక్కితే జీవితం జైలుకే.. ఒక నెలో.. రెండు నెలలో కాదు.. 20 కిలోల లోపు గంజాయితో పట్టుబడినా 20 ఏళ్లు తప్పదు.. ఇప్పటికే ఈ చట్టం కింద అనకాపల్లి జిల్లా న్యాయస్థానం 20 కిలోల గంజాయి రవాణా కేసులో ఇద్దరికి 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. ఇటీవల ఓ స్మగ్లరు గంజాయి అక్రమ వ్యాపారంలో కూడబెట్టిన రూ.2 కోట్ల ఆస్తులను ప్రభుత్వం జప్తు చేసింది. రెండు కేసుల్లో నిందితులుగా ఉంటే మరణదండనే..అదనపు ఆదాయానికి ఆశపడి గంజాయి కేసులో చిక్కారో.. ఇక జీవితం అంతే.. తస్మాత్ జాగ్రత్త!

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

గంజాయి కేసులో చిక్కితే జీవితం కటకటాల పాలే.. బయటకు వచ్చేదారుండదు.. బెయిల్ వచ్చే అవకాశం ఉండదు. అంతలా చట్టాలను కట్టుదిట్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచే గంజాయి నిర్మూలన దిశగా యుద్ధం మొదలుపెట్టింది. 'ఈగిల్' పేరుతో ఓ ప్రత్యేక పోలీసు బృందాన్ని ఏర్పాటు చేసింది. మరో వైపు నార్కొటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సస్ యాక్ట్(ఎన్‌డీపీఎస్) అత్యంత పదునైన చట్టం. దీంతో గంజాయి కేసుల్లో మరణ దండన విధించే అవకాశం ఉంది. దీనిపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

దొరికితే జీవితానికి పొగ

గంజాయి కేసులు ఎన్‌డీపీఎస్ చట్టం పరిధిలోకి వస్తాయి. గంజాయి ఇతర నిషేధిత మాదకద్రవ్యాల సాగు, విక్రయించడం, కొనుగోలు, రవాణా,కాల్చడం(వినియోగం),నిల్వ..ఇవన్నీ ఎన్‌డీపీఎస్ చట్టం కిందకే వస్తాయి. గంజాయి కేసుల్లో ఎన్‌డీపీఎస్ చట్టం ద్వారా పట్టుబడిన పరిమాణాన్ని బట్టి కఠినమైన శిక్షలు ఉంటాయి. బెయిల్ రాకపోవడమే కాకుండా శిక్షను పూర్తిగా అనుభవించాల్సిందే.శిక్ష ఖరారైన ఖైదీకి ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమాభిక్ష ఉండదు.సాధారణంగా ఏ కేసులోనైనా నేరాన్ని పోలీసులు, ప్రాసిక్యూషన్ రుజువు చేయాల్సి ఉంటుంది. కానీ ఎన్‌డీపీఎస్ కేసులో తాను నేరం చేయలేదని నిందితుడే నిరూపించుకోవాలి. తెలిసి చేసినా,తెలియక చేసినా విష వలయంలో చిక్కు కున్నట్టే.ఈ కేసుల్లో ఒక్కసారి చిక్కితే కేంద్ర హోంశాఖ నిర్వహించే నేషనల్ ఇంటి గ్రేటెడ్ డేటాబేస్ ఆన్ అరెస్టెడ్ నార్కో-అఫెండర్స్ (నిదాన్) పోర్టల్‌లో పేరు నమోదవుతుంది. ఆ జాబితాలో ఉన్న వాళ్లకు పాస్‌పోర్ట్ జారీ చెయ్యరు. అంటే దేశం దాటడానికి లేకుండా గేట్లు మూసేసినట్టే.

కూటమి యుద్ధం ఇలా

గంజాయిపై యుద్ధానికి కార్యాచరణకు కూటమి ప్రభుత్వం ఇప్పటికే యాంటీ నార్కొటిక్ టాస్క్‌ఫోర్స్(ఏఎన్‌టీఎఫ్) అవసరమైన సిబ్బంది, సంపత్తితో రంగంలోకి దిగింది. కేంద్ర ఇంటెలిజెన్స్ బ్యూరో పని చేసి సమర్థవంతమైన అధికారిగా గుర్తింపు తెచ్చుకున్న ఐజీ ర్యాంకు అధికారి ఆకే రవికృష్ణను ఏఎన్‌టీఎఫ్ అధిపతిగా నియమించింది. మత్తు పదార్థాల నిల్వ, స్మగ్లింగ్, విక్రయాలతో పాటు గంజాయి సాగు, సరఫరా, వినియోగానికి సంబంధించిన సమాచారాన్ని సేకరిస్తోంది. టోల్ ఫ్రీ నంబరును ఏర్పాటు చేసి కచ్చితమైన సమాచారం ఇచ్చిన వారికి నగదు బహుమతి అందజేసే ఏర్పాటు చేసింది. జిల్లాలో నలుగురితో ఈగిల్ బృందాన్ని ఏర్పాటు చేశారు. అయితే వారికి ఆఫీసు పెట్టాల్సి ఉంది.

- మరింత కఠినంగా చట్టం
- ఎన్‌డీపీఎస్ యాక్ట్ కట్టుదిట్టం
- 20 కిలోలు దాటితే 20 ఏళ్లు
- చిక్కితే నిదాన్‌లో నమోదు
- పాస్ పోర్టూ రాదు
- సహాయం చేసినా 20 ఏళ్లు
- కూటమి ప్రభుత్వ యుద్ధం
- గంజాయిపై ఉక్కుపాదం
- నిర్మూలన దిశగా చర్యలు

రెండు కేసుల్లో రుజువైతే మరణశిక్ష

కిలో నుంచి 20 కిలోల లోపు గంజాయితో పట్టుబడితే పదేళ్ల వరకూ జైలు, జరిమానా తప్పదు. అంతకంటే ఎక్కువ పరిమాణంలో దొరికితే 20 ఏళ్ల వరకూ జైలు శిక్ష, కనీసం రూ.లక్ష జరిమానా విధించే అవకాశం ఉంటుంది.రెండు సార్లు అంతకు మించిన కేసుల్లో దోషిగా రుజువైతే 30 ఏళ్ల వరకూ జైలు శిక్ష లేదా మరణ దండన కూడా విధించవచ్చు. గంజాయి సాగు, రవాణాకు సహాయం చేసినా 20 ఏళ్ల శిక్ష అనుభవించడానికి సిద్ధంగా ఉండాల్సిందే.గంజాయి ఉత్పత్తి, వ్యక్తి దగ్గర ఉండడం, నిల్వ చేయడం, రవాణా, వినియోగం, అందుకు ప్రయత్నించడం ప్రేరేపించడం అన్నీ నేరాలే.

గతేడాది 65 కేసులు..

తూర్పుగోదావరి జిల్లా పోలీసులు గతేడాది 65 కేసుల్లో 195 మందిని అరెస్టు చేసి సుమారు 3 వేల కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.ఈ ఏడాది ఇప్పటి వర కూ 4 కేసుల్లో 40 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. 22 మందిని నిందితులుగా గుర్తించగా 21 మందిని అరెస్టు చేశారు.సరఫరా చేసిన వాడిని అరెస్టు చేయాల్సి ఉంది.మిగిలిన రెండు జిల్లా ల్లోనూ పరిస్థితి కాస్త అటూ ఇటూగా ఉంది. ఎక్కువగా తూర్పు నుంచే రవాణా ఉంటుంది.

ఏవోబీ నుంచి వచ్చేదెలా!

ఈ నెల 4న కొవ్వూరులో 10కిలోల గంజాయితో నలుగురు యువకులు అరెస్టు అయ్యారు. ఈ ఘటన జిల్లాలో గంజాయి తగ్గుముఖం పట్టలేదని రుజువు చేస్తోంది. ఎక్కడో దండకారణ్యంలో సాగవుతున్న గంజాయి ఫారెస్టు, పోలీస్, ఎక్సయిజ్ వాళ్ల కళ్లుగప్పి పట్టణాలు, గ్రామాలకు చేరుతోంది. దీనికి ప్రధాన కారణం ఆయా శాఖల్లోని కొందరు సిబ్బంది లోపాయికారిగా గంజాయి రవాణాకు సహకరిస్తుండడమే అనే అనుమానాలు ఉన్నాయి. అటవీ సంపద అక్రమంగా తరలిపోకుండా ఏజెన్సీ మండ లాల్లో ఫారెస్ట్ చెక్‌పోస్టులు మండలానికి సుమారు 15 వరకూ ఉంటాయి. మారేడుమిల్లి, రాజవొమ్మంగి, చింతూరు, జడ్డంగి తదితర పోలీస్ స్టేషన్లు రోడ్డు పక్కనే చూస్తుంటాయి. కానీ అరకొర తప్ప భారీ తరలింపులు వాటికి కనిపించవు. గతంలో గంజాయి రవా ణాకు సహరిస్తున్న చింతూరు ఎస్ఐ, కానిస్టేబుల్ అరెస్ట్ అయ్యారు.పోలీసులు చూసీ చూడనట్టు వదిలే యడానికి 'ఒప్పందాలు'ంటాయని సమాచారం.

సెంట్రల్ జైలులో 400 మంది

గంజాయి దందాలో అమాయక గిరిజనం జీవితాలు చిత్తవుతున్నాయి.గతంలో ముగ్గురు అమాయక గిరిజన మహిళలు గంజాయితో రాజమహేంద్రవరంలో ఎస్ఈబీ పోలీసులకు పట్టుబడ్డారు. కనీసం వారి కాళ్లకు చెప్పులు కూడా లేవు.ఆ గంజాయిని విజయవాడలో అప్పగిస్తే రూ.2 వేలు చొప్పున ఇవ్వడానికి ఒప్పందం కుదిరింది. గంజాయిని తరలించే క్రమంలో అనుమానం రాకుండా ఉండ డానికి మహిళలను రంగంలోకి దింపుతున్నారు. మరో వైపు అమాయక గిరిజనులు పోలీసులకు పట్టుబడుతూ జైళ్లలో మగ్గిపోతున్నారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో గంజాయి కేసుల్లో 55 మంది శిక్ష అనుభవిస్తుండగా.. 357 మందిపై న్యాయస్థానంలో విచారణ జరుగుతోంది.వీరిలో అధిక శాతం గిరిజనులే ఉన్నారు. అయితే ఎన్‌డీపీఎస్ చట్టంపై గిరిజన గ్రామాల్లో అవగాహన కల్పించకపోవడం,సరైన నిఘా లేకపోవడం వంటివి గిరిజనుల పాలిట శాపంగా మారుతున్నాయనే వాదన ఉంది.

జనార్దనుడి రథోత్సాహం



రాజమహేంద్రవరం రూరల్ మండలం ధవళేశ్వరంలో జనార్దనుడి రథోత్సవం శనివారం వైభవంగా సాగింది..కల్యాణోత్సవాల్లో భాగంగా సాయంత్రం 4 గంటలకు రథం కదలింది.. పెద్ద ఎత్తున భక్తజనం హాజరై నమో జనార్దనాయ అంటూ రథాన్ని లాగారు.. ఆలయం నుంచి కిలోమీటరు దూరం వరకూ భక్తులు రథంపై అరటిపండ్లు విసురుతుండగా ముందుకు సాగింది. ఉదయం మంత్రి కందుల దుర్గేష్ స్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు. - 6లో

జీతాలొచ్చే టైమ్..టార్గెట్! 8
సహాయం చేస్తామని.. ఏటీఎంల వద్ద మోసాలు

రాజకీయాలు.. వైకుంఠపాళి! 3

రీ సర్వే విధుల్లో నిర్లక్ష్యం.. కలెక్టర్ కొరడా



- 26 మందికి షోకాజ్ నోటీసులు
- 12 మంది డిప్యూటీ తహశీల్దార్లు
- 12 మంది మండల సర్వేయర్లు
- ఇద్దరు గ్రామ సర్వేయర్లు
- వివరణకు కలెక్టర్ ఆదేశాలు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : పని చేయని ఉద్యోగులపై కలెక్టర్ పి.ప్రశాంతి కొరడా ఝుళిపించారు.విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న 26 మంది ఉద్యోగులకు శనివారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు.ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.వీరిలో 12 మంది డిప్యూటీ తహశీల్దార్లు, 12 మంది మండల సర్వేయర్లు, ఇద్దరు గ్రామ సర్వేయర్లు ఉన్నారు. క్షేత్రస్థాయిలో రీసర్వే ప్రక్రియను నిర్దిష్టమైన మార్గదర్శకాలు అనుసరించి చేయాలి. కానీ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వారికి కలెక్టర్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు.ఈ మేరకు పెరవలి, గోపాలపురం, రాజమహేంద్రవరం రూరల్, చాగల్లు, గోకవరం, కడియం, దేవరపల్లి, నల్లజర్ల, బిక్కవోలు, కోరుకొండ, సీతానగరం, రాజానగరం మండలాలకు చెందిన 12 మంది డిప్యూటీ తహశీల్దార్లు, 12 మంది మండల సర్వేయర్లకు నోటీసులు జారీ చేసినట్టు కలెక్టర్ తెలిపారు. విధులు, బాధ్యతలు నిర్వర్తించడంలో విఫలమయ్యారని, రీ సర్వే సమస్యల పరిష్కారంలో ఉన్నతాధికారుల సూచనలు పాటించక పోవడం తదితర కారణాలతో షోకాజ్ నోటీసులు జారీ చేశారు. గ్రామ సర్వేయర్లు తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తించడం లేదని.. వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ రాజానగరం మండలం యర్రంపాలెం సర్వేయర్ వి.రమేష్‌కు మార్, కానవరం సర్వేయర్ వై.నాగరాజుకు షోకాజ్ నోటీ సులు ఇచ్చారు.రమేష్ కుమార్ లాగిన్‌లో ఐదు పౌరసేవలు, గంగరాజు లాగిన్‌లో నాలుగు పౌర సేవలు పెండింగ్‌లో ఉన్నాయి. ఇవి జిల్లా పురోగతి మొత్తం మీద ప్రభావం చూపాయని అందువల్ల ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ రూల్స్‌కు లోబడి వివరణ ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు.



స్వామివారి రథోత్సవంలో పాల్గొన్న భక్తజనసందోహం

కనుల నిండుగా..

- రథంపై ఊరేగిన స్వామి-అమ్మవార్లు
- మార్మోగిన గోవిందనామ స్మరణ
- లక్షలాది మంది భక్తుల రాక

స్వామిని చూడగా

● వైభవంగా అంతర్వేది లక్ష్మీనరసింహుడి రథోత్సవం



స్వామివారి రథాన్ని లాగుతున్న భక్తులు



రథోత్సవంలో ఆలయ చైర్మన్ రామగోపాల్ రాజాబహుదూర్, ఎమ్మెల్యే వరప్రసాద్

అంతర్వేది, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): గోవింద నామస్మరణతో అంతర్వేది పరిసరాలు మార్మోగాయి. శనివారం మధ్యాహ్నం 2.49 నిమిషాలకు శ్రీలక్ష్మీనరసింహస్వామివారి రథోత్సవం ప్రారంభమైంది. పురవీధుల్లో లక్షలాది మంది భక్తజన సందోహాల మధ్య కనుల పండువగా నిర్వహించారు. తూర్పు, పశ్చిమ, కృష్ణా జిల్లాలతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో జనం తరలివచ్చి భక్తిపారవశ్యంలో పులకించారు. స్వామివారి సోదరి అశ్వరూఢాంబిక(గుర్రాలక్కమ్మ)కు చీర, సారెను లాంచనప్రాయంగా తీసుకువెళ్లారు. రథానికి బ్యాటరీతో కూడిన జాకీ ఏర్పాటుచేయడంతో గుర్రాలక్కమ్మ గుడి మలుపులో సునాయాసంగా రథం ముందుకు కదిలింది. తొలుత ఆలయ ఫ్యామిలీ ఫౌండర్ మెంబర్, చైర్మన్ మొగల్తూరు రాజా కలిదిండి కుమారరామగోపాలరాజా బహదూర్ రథానికి తొలిపూజ చేశారు. అనంతరం కొబ్బరికాయ, గుమ్మడికాయను కొట్టి రథాన్ని ప్రారంభించారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, జేసీ టి.నిషాంతి, డీసీ డీఎల్వీ రమేష్‌బాబు, ఉత్సవ కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, డీఎస్పీలు ఎస్.మురళీమోహన్, టీఎస్ఆర్కే ప్రసాద్ కొబ్బరికాయలు కొట్టారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ ఆలయం నుంచి స్వామి-అమ్మవార్ల ఉత్సవ మూర్తులను రథంపై కొలువు తీర్చి ఊరేగింపుగా గుర్రాలక్కమ్మ గుడికి తీసుకువచ్చారు. రాజావారి వీధి నుంచి ప్రారంభమైన రథయాత్ర పల్లపు వీధిలోని 16 స్తంభాల మండపానికి చేరుకోవడానికి సుమారు నాలుగు గంటల సమయం పట్టింది. గోవింద, నరసింహానామస్మరణతో రథాన్ని భక్తులు లాగారు. రథానికి అరటి గెలలు, గుమ్మడికాయలు, వరి కంకులు కట్టారు. భీష్మఏకాదశిని పురస్కరించుకుని తెల్లవారుజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. జంగమ దేవరులు పూరించిన శంఖాల ధ్వనితో సాగర సంగమ తీరప్రాంతం మార్మోగింది. ఆలయ ప్రాంగణంలో ఉన్న గ్రామ పురవీధుల్లో భక్తుల తాకిడితో అంతర్వేది వేదికగా మారింది. స్వామివారి కల్యాణోత్సవం, రథోత్సవంలో లక్షలాది మంది భక్తులు పాల్గొనడం విశేషం. రానున్న రోజుల్లో రాష్ట్ర ఉత్సవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలను నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, డెల్టా ప్రాజెక్టు చైర్మన్ పినిశెట్టి బుజ్జి, వైస్‌చైర్మన్ ఆకన బాబ్జినాయుడు, ముప్పర్తి నాని, గుబ్బల ఫణికుమార్, వనమాలి మూలాస్వామి, పోతురాజు శ్రీవెంకటకృష్ణ, కొపనాతి కృష్ణమ్మ కుటుంబీకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉత్సవ కమిటీ సభ్యులు, కూటమి శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

రథోత్సవానికి 59 వసంతాలు పూర్తి..

రథోత్సవం ప్రారంభమై ఈ ఏడాదితో 59 వసంతాలు పూర్తి చేసుకుంది. రథంపై కొలువు దీరిన స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు విశేష పూజలు చేస్తూ రథం వెంబడి సాగారు. మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, బాణసంచా కాల్పులు, పలు సాంస్కృతిక కార్యక్రమాల ఎంతో ఆకట్టుకున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

వేలాదిగా భక్తుల పుణ్యస్నానాలు..



సముద్రంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

భీష్మఏకాదశి, మాఘ శనివారం కావడంతో వేలాదిగా భక్తులు వచ్చి సముద్ర స్నానాలు చేసి అనంతరం స్వామివారిని దర్శనం చేసుకున్నారు. అంతర్వేదిలో బ్రహ్మదేవునిచే ప్రతిష్ఠింపబడిన క్షేత్రపాలకుడు నీలకంఠేశ్వర స్వామితో పాటు క్షేత్ర సంరక్షకుడు శ్రీఆంజనేయ స్వామి, శ్రీవశిష్ఠ ఆశ్రమం, గుర్రాలక్కమ్మ ఆలయాల్లో వేలాదిగా భక్తులు పూజలు చేశారు. పుణ్యక్షేత్రం మంతా భక్తులతో కిటకిటలాడింది. గ్రామ పురవీధుల్లో భక్తుల సందడి నెలకొంది.

నేడు గజ, పొన్న వాహనాలపై స్వామివారి గ్రామోత్సవం

కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు లక్కవరం వాస్తవ్యులు మంగెన నాగేశ్వరరావు వారిచే నిర్మించిన గజ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తారు. శనివారం స్వామివారి ఆలయాన్ని శుద్ధిచేసి రాత్రి 7 గంటలకు పొలమూరి సత్రం నిర్వాహకులచే అన్నపర్వత మహా నివేదన, రాత్రి 8 గంటలకు శృంగవరప్పాడు వాస్తవ్యులు రావి వెంకట సత్యనారాయణ, శ్రీహరిరావుచే నిర్మితమైన పొన్న వాహనంపై స్వామివారి గ్రామోత్సవాలు జరుగతాయని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు.

● భక్తులకు అక్షింతల పంపిణీ..

స్వామివారి కల్యాణం అనంతరం తలంబ్రాలు బియ్యం కోసం భక్తులు బారులు తీరారు. తెల్లవారు జామున మూడుగంటల నుంచి క్యూలైన్లలోనే ఆలయ సిబ్బంది భక్తులకు తలంబ్రాలు అందజేశారు. ప్రతీ భక్తునికి అక్షింతలు అందేలా జాగ్రత్తలు తీసుకున్నట్టు ఆలయ ఏసీ వి.సత్యనారాయణ తెలిపారు.



స్వామివారి దర్శనానికి క్యూలైన్‌లో భక్తులు



రథోత్సవంలో జేసీ నిషాంతి



పట్టు వస్త్రాలు తీసుకుని వెళుతున్న ఎమ్మెల్యే దేవవరప్రసాద్



రథాన్ని లాగుతున్న ఏసీ సత్యనారాయణ, పోలీసులు



సముద్రం వద్ద శంఖం పూరిస్తున్న జంగమదేవరులు



కల్యాణం అనంతరం ఆలయ ప్రాంగణంలో నిద్రిస్తున్న భక్తులు

కల్యాణ మండపం వద్దే నిద్ర..

శుక్రవారం రాత్రి 12:55 గంటలకు మృగశిర నక్షత్రయుక్త వృశ్చిక లగ్నమందు స్వామివారు-అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని తిలకించిన అనంతరం భక్తులు కల్యాణ మండపానికి ఆనుకుని ఉన్న ప్రదేశంలోనే నిద్రించారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చినవారు అక్కడే సేద తీరారు.

భక్తజన సంద్రమైన సత్యదేవుని సన్నిధి

- భీష్మ ఏకాదశి పర్వదినాన రూ.కోటి ఆదాయం
- సత్ఫలితాలిచ్చిన ముందస్తు చర్యలు
- ఎప్పటికప్పుడు పర్యవేక్షించిన ఈవో, చైర్మన్‌లు

అన్నవరం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధి శనివారం భీష్మ ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని భక్తజన సంద్రమైంది. రద్దీని దృష్టిలో ఉంచుకుని 12 గంటల నుంచి వ్రతాలు, ఒంటిగంట నుంచి సర్వదర్శనాలు ప్రారంభించారు. సుమారు 13 వేల వ్రతాలు జరగగా వివిధ విభాగాల ద్వా రా స్వామివారికి రూ.కోటి ఆదాయం సమకూరింది. అంచనాకు తగ్గట్లుగా భక్తులు విచ్చేశారు. ముందస్తు జాగ్రత్త చర్యలు సత్ఫలితాలిచ్చాయి. ఎక్కడా తోపులాటలు జరగకుండా పశ్చిమరాజగోపురం వద్ద హోల్డింగ్ పాయింట్లు పెట్టడంతో ఆలయప్రాంగణం లోపల వ్రతమండపాలు ఖాళీ అయ్యాక భక్తులను లోపలికి అను మతించారు. ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ భక్తులకు స్వాంతన చేకూర్చారు. తూర్పురాజగోపునం వద్ద ఏర్పాటు చేసే భీష్మ పితామహుడి పుష్పాలంకరణ కటౌట్‌ను ఈ ఏడాది రామాలయం పక్కనున్న వార్షిక కల్యాణవేదిక వద్ద ఏర్పాటు చేయడంతో భక్తులు అక్కడ సెల్ఫీలు దిగారు. సుమారు 80వేలమందిని స్వామిని దర్శించుకోగా ప్రత్యేక దర్శనానికి రెండు గంటలు, ఉచిత దర్శనానికి మూడుగంటల సమయం భక్తులు వేచిఉన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా ప్రత్తిపాడు సీఐ సూరిఅప్పారావు పర్యవేక్షణలో పోలీస్‌సిబ్బంది వాహనాలను సత్యగిరి కొండపైకి మళ్లించారు. అక్కడ నుంచి స్వామివారి వ్రతాలు, దర్శనానికి వెళ్లే భక్తుల కోసం దేవస్థానం, ప్రయివేట్ విద్యాసంస్థల సహకారంతో ఉచిత రవాణా వసతి కల్పించారు. కొండదిగువ నుంచి, రైల్వేస్టేషన్, కొండపైకి ఆర్టీసీబస్సులు నడపడంతో రవాణా కష్టాలు గట్టెక్కాయి. సత్యదేవా నిత్యాన్న దాన పథకం ద్వారా సుమా రు 20వేల మందికి ఉచిత పులిహోర, దద్దోజన ప్రసాదాన్ని వితరణ చేశారు. స్వా మి దర్శనం అనంతరం లిఫ్ట్ దగ్గర వెనుక రాజగోపురం తాళాలు ఎక్కడున్నాయో తెలియక వృద్ధులు, వికలాంగులు కొంత అసహనానికి లోనయ్యారు. సిబ్బంది సమష్టి కృషితో భక్తులకు సంతృప్తికరమైన సేవలందించామని ఈవో తెలిపారు.



స్వామివారి దర్శనం కోసం బారులుతీరిన భక్తులు

వేడుకగా సత్యదేవుడి ప్రాకారసేవ

రత్నగిరివాసుడైన సత్యదేవుడికి ప్రతి శనివారం నిర్వహించే ప్రాకారసేవ వేడుకగా జరిగింది. భక్తుల గోవిందనామస్మరణలు, పండితుల వేదమంత్రాల నడుమ ముమ్మారు. స్వామి,అమ్మవార్లు తూర్పురాజగోపురం చుట్టూ ప్రదక్షణ గావించారు. హారతులిచ్చి తిరిగి ప్రదానాలయానికి తీసుకెళ్లారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి శనివారం విశాఖట్నానికి చెందిన ఎం.వీరునాయుడు, అప్పలనరసమ్మ దంపతులు రూ.1,00,116 విరాళంగా ఈవో సుబ్బారావుకు అందజేయగా ఆయన అభినందించి వారికి స్వామివారి ప్రసాదాలు, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో పీఆర్వో కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



వ్రతాలు ఆచరించుకుంటున్న భక్తులు

ఏవీ నగరంలో...

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం



పూజల్లో పాల్గొన్న యనమల దంపతులు

తొండంగి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తొండంగి మండలం ఏవీనగరం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుని అష్టమ వార్షికోత్సవాల్లో రెండవ రోజైన శనివారం స్వామి వారి కల్యాణం వైభవోపేతంగా జరిగింది. తెల్లవారుజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నవనీత హారతి సమర్పించారు. మంత్రపూరితమైన అష్టోత్తర శత కలశాలలో ఉన్న పవిత్ర జలాలతో స్వామికి సం ప్రోక్షణ, స్నపన తిరుమంజనం జరిపారు. స్వామిని పట్టు పీతాంబరాలతో వివిధ పుష్పమాలికలతో నయనానందకరంగా అలంకరించారు. నుదుట తిరునామం, విశేష ఆభరణాలతో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం ఏడు శనివారాల వ్రతం చేపట్టిన భక్తులతో ప్రత్యేక హోమం నిర్వహించారు. స్వామి అమ్మ వార్ల ఉత్సవమూర్తులకు టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు, విజయలక్ష్మి దంపతులు, ఎమ్మెల్యే యనమల దివ్య గోపీనాథ్ దంపతులు లక్ష తులసి పూజ జరిపారు. రుత్వికులు మహానారాయణ హోమం నిర్వహించారు. భక్తులతో సామూహిక సత్యన్నారాయణ వ్రతాలు నిర్వహించారు. అనంతరం స్వామితో పాటు ఉభయ దేవేరులను ఉన్నతాసనంపై ఉంచి అర్చక స్వాములు కల్యాణ క్రతువుకు శ్రీకారం చుట్టారు. మాంగళ్యధారణ, అక్షతారోపణ నిర్వహించారు. యనమల రామకృష్ణుడు దంపతులు కల్యాణ కర్తలుగా స్వామి అమ్మవార్లకు నూతన పట్టు వస్త్రాలు సమర్పించారు. కల్యాణానంతరం నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. భక్తులకు మహాన్నదానం జరిగింది. సాయంత్రం కల్యాణ మూర్తులను రథంపై ఉంచి కో లాటం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ గ్రామోత్సవం చేపట్టారు.

తరలివచ్చిన ప్రముఖులు

ఏవినగరంలో కల్యాణ మహోత్సవాల్లో కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, తుని మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్ బాబు, బండారు సత్యానందరావు పాల్గొని స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.



రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



వాడపల్లిలో శ్రీ వేంకటేశ్వరస్వామి

వాడపల్లికి పోటెత్తిన భక్తులు

ఆలయానికి రూ.53.61 లక్షల ఆదాయం

ఆత్రేయపురం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. శనివారం భీష్మ ఏకాదశి కావడంతో వేలాదిగా తరలివచ్చారు. సుమారు 50వేల నుంచి 60వేల మంది స్వామివారిని దర్శించుకోగా 30 నుంచి 32వేల మంది అన్నప్రసాదం స్వీకరించినట్టు అధికారుల అంచనా. వేకువజామునే స్వామి వారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మిహోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను, శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వర్ణ శోభితుడైన శ్రీవారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. భక్తులు స్వామివారి తీరువీధులలో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తులభారాలు, కానుకలు సమర్పించుకున్నారు. రాత్రి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా ఆలయానికి రూ.53,61,899 ఆదాయం లభించినట్టు ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

గంటల పాటు నిరీక్షణ

వేలాది భక్తులు స్వామివారి సన్నిధికి చేరుకోవడంతో వేదాశీర్వచనం, విశిష్ట దర్శనాల వద్ద క్యూలు నిండిపోయాయి. సర్వదర్శనం కోసం వేచిఉన్న భక్తులు గంటల తరబడి క్యూలో మగ్గిపోయారు.

రూ.200 దర్శనం కోసం టిక్కెట్టు పొందిన భక్తులు సుమారు 5 గంటల పాటు క్యూలో నిరీక్షించారు. కొంతమంది స్పృ హ కోల్పోయారు. అధికారులు భక్తులు దర్శనాలు ముందుకు సాగేలా చర్యలు చేపట్టారు.





వాడపల్లిలో క్యూలో, అన్న ప్రసాదం కౌంటర్ వద్ద భక్తులు

సందేశాత్మకంగా.. ఆలోచింపచేసేలా..

తాటిపర్తిలో ఉభయ తెలుగు రాష్ట్రాల నాటికల పోటీలు

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాల జోలికి వెళితే జీవితం చిన్నాభిన్నమవుతుంది. మన వినాశనాన్ని మనమే కొని తెచ్చుకున్నట్టు అని తెలియచెప్పే నాటిక ఒకటి, ఆడపిల్లల పట్ల వివక్ష తగదనే సందేశాన్ని ఇస్తూ ప్రదర్శించిన మరో నాటిక. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తిలోని అపర్ణా కళాతోరణం బత్తుల మురళీకృష్ణ కళావేదికపై జరుగుతున్న ఉభయ తెలుగు రాష్ట్రాల నాటికల పోటీల్లో మూడో రోజు ప్రదర్శించిన నాటికలు సందేశాత్మకంగా, ఆలోచింపచేసేలాగా సాగాయి. సమాజంలో యువత మత్తు పదార్థాలకు బానిసలై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని కట్రపాడు ఉషోదయ కళానికేతన్ కళాకారులు ప్రదర్శించిన విముక్తి నాటకం ద్వారా తెలియచెప్పారు. మత్తు నుంచి యువతకు విముక్తి కల్పించి దేశాన్ని కాపాడుకుందామని సందేశామిచ్చారు. నాటికను చెరుకూరి సాంబశివరావు రచించి దర్శకత్వం వహించారు. మహిళను సాటి మనిషిగా గుర్తించకపోవడం, గౌరవించకపోవడం అకృత్యం, అమానుషమని హైదరాబాదు గోవాడ క్రియేషన్స్ కళాకారులు ప్రదర్శించిన మూల్యం నాటిక ద్వారా వివరించారు. దారుణ వివక్షకు గురైన ఒక వివాహిత యువతి శంఖారావం పూరించి తన హక్కులను కాపాడుకున్న విధానాన్ని తెలియజేశారు. సింహప్రసాద్ రచించిన ఈ నాటికకు డాక్టర్ వెంకట్ గోవాడ దర్శకత్వం వహించారు.





తాటిపర్తిలో ప్రదర్శించిన విముక్తి నాటిక దృశ్యం, మూల్యం నాటికలోని ఓ సన్నివేశం

బాబికి లైఫ్ సేవియర్ అవార్డు

● సేవకు చిరంజీవే స్ఫూర్తి

● 100సార్లు రక్తదానం చేసిన బాబి



చిరంజీవి నుంచి అవార్డు అందుకుంటున్న బాబి

శంఖవరం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): వందసార్లు రక్తదానం చేయడమే కాకుండా పలుమార్లు రక్తదాన శిబిరాలు నిర్వహించి రక్తాన్ని సేకరించినందుకు చిరంజీవి అభిమాని, జిల్లా చిరంజీవి యువత అధ్యక్షుడు మేడిశెట్టి సూర్యకిరణ్ (బాబీ)కి లైఫ్ సేవియర్ అవార్డు లభించింది. జిల్లాలో చిరంజీవి అభిమానులను సేవామార్గంవైపు నడిపిస్తున్నందుకు బాబిని చిరంజీవి అభినందించారు. ఈ అవార్డును మెగాస్టార్ చిరంజీవి నుంచి శనివారం అందుకున్నాడు. చిరంజీవి మీద అభిమానంతోనే రక్తదానం చేయడం ప్రారంభించానని, ఆయన ఇచ్చిన పిలుపు ద్వారా ఎంతోమందికి సహాయం చేశామన్న సంతోషం ఉందని ముఖ్యంగా కొవిడ్ సమయంలో చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎంతోమందికి ప్రాణవాయువును అందించడం మరింత సంతోషాన్నిచ్చిందని అన్నారు. ఈఅవార్డు మరింత బాధ్యతను ఇచ్చిందని దీంతో మరింత సేవాకార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

మార్చి 8న జాతీయ లోక్ అదాలత్

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మార్చి 8న ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లాలోని అన్ని కోర్టుల్లో జాతీయ లోక్అదాలత్ నిర్వహిస్తున్నట్టు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలకు సంబంధించిన కేసులు కూడా లోక్ అదాలత్‌లో పరిష్కరిస్తారన్నారు. ఉమ్మడి జిల్లాలోని రాజమహేంద్రవరం, అమలాపురం, కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం, రామచంద్రపురం, రాజోలు, ఆలమూరు, తుని, ముమ్మిడివరం, కొత్తపేట, ప్రత్తిపాడు, అనపర్తి, రంపచోడవరం, అడ్డతీగల కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తారన్నారు. ప్రధానంగా పెండింగ్‌లో ఉన్న సివిల్ తగాదాలు, యాక్సిడెంట్ కేసులు, బ్యాంకు కేసులు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, ప్రీ లిటికేషన్ కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరిస్తారన్నారు.



భీమేశ్వరస్వామివారికి లక్షరుద్రాక్షల పూజ





టీటీడీ పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న దేవదాయశాఖ తనిఖీదారు రాపాక బాలాజీరామ్‌ప్రసాద్, స్వామివారికి వస్త్రాలు అందజేస్తున్న మంత్రి సుభాష్ దంపతులు



స్వామివారి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

కల్యాణం...వైభోగం

● వైభవోపేతంగా భీమేశ్వరుడి కల్యాణం

● తన్మయత్వంతో తిలకించిన భక్తులు

ద్రాక్షారామ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరస్వామివారి దివ్యకల్యాణ మహోత్సవం శనివారం రాత్రి ఘనంగా జరిగింది. మాఘ శుద్ధ ఏకాదశి ఆరుద్ర నక్షత్రయుక్త తులా లగ్నమందు పుష్పాలంకృతమైన కల్యాణ వేదికపై మంగళ వాయిద్యాలు, వేదమంత్రాలతో జరిగిన భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవారి పరిణయం భక్తులు తన్మయత్వంతో తిలకించారు. మూలవిరాట్ శ్రీ భీమేశ్వరస్వామి, మాణి క్యాంబ అమ్మవార్లకు, క్షేత్ర పాలకులు శ్రీలక్ష్మీసమేత నారాయణస్వామి, శ్రీచండికా సమేత సూరేశ్వరస్వామికి ఏకకాలంలో జరిగిన కల్యాణ మహోత్సవం అమితాసక్తిగా భక్తులు తిలకించారు. కల్యాణమూర్తులు మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి, క్షేత్ర పాలకులు లక్ష్మీసమేత నారాయణస్వామి, చండికా సమేత సూరేశ్వర స్వామివార్లకు నంది వాహనంపై నగరోత్సవం మేళతాళాలు, బాజాభజంత్రీలతో జరిగింది. అనంతరం కల్యాణమూర్తులను అర్చకస్వాములు వేదమంత్ర పఠనంతో ,మంగళవాయిద్యాలతో కల్యాణ వేదికపైకి తోడ్కొని వచ్చారు.

కల్యాణ తంతు

ఆలయ బ్రహ్మ దేవులపల్లి ఫణి రామకృష్ణ , వైదిక బృందం కల్యాణవేదికపై కల్యాణమూర్తులను అధిష్టింపచేసి కల్యాణం తంతు ప్రారంభించారు. సంకల్పం, గణపతిపూజ, పుణ్యాహవాచనం అనంతరం కంకణధారణ జరిపించారు. అనంతరం స్వామివార్లకు సువర్ణయజ్ఞోపవీత ధారణ జరిగింది. రాత్రి 11.05 గంటలకు కల్యాణ మూర్తులు స్వామివార్లు, అమ్మవార్ల శిరస్సున అర్చకస్వాములు జీలకర్ర బెల్లం ఉంచి సుముహూర్తం జరిపించారు. అనంతరం మాంగల్యధారణ నిర్వహించారు. ఆహ్లాదంగా ముత్యాల తలంబ్రాలు కార్యక్రమం జరిగింది. పునఃపూజ, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించ డంతో కల్యాణ మహోత్సవం తంతు ముగిసింది. భక్తులకు ముత్యాల తలంబ్రాలు స్వామి తీర్థప్రసాదాలు అందజేశారు. పలువురు దాతలు భక్తులకు స్వీట్లు పంపిణీ చేశారు.

పట్టువస్త్రాలు సమర్పించిన అధికారులు

స్వామివారి కల్యాణోత్సవం పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు స్వామివారు,అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. మంగళవాయిద్యాలతో ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని పట్టు వస్త్రాలు దేవదాయశాఖ తనిఖీదారు రాపాక బాలాజీ రామ్‌ప్రసాద్ ఆలయ సహాయ కమీషనరు అల్లు వెంకట దుర్గాభవానీకి అందజేశారు. డీఎస్పీ రఘువీర్ దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. స్వామివారి కల్యాణోత్సవాన్ని మంత్రి సుభాష్, వాడ్రేవు సుందరరత్నాకరరావు, అధికసంఖ్యలో భక్తులు వీక్షించారు.

ఘనంగా లక్ష రుద్రాక్షలపూజ

మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం పురస్కరించుకుని శనివారం ఉదయం భీమేశ్వరస్వామికి ఏకాదశ రుద్రాభిషేకం ఘనంగా జరిగింది. గణపతిపూజ, మహాన్యాసం అనంతరం పుణ్య నదీజలాలు, పంచామృతాలు, పండ్ల రసాలతో స్వామిని అభిషేకించారు. లక్ష రుద్రాక్షలతో పూజ నిర్వహించారు. అర్చకులు కళ్లేపల్లి ఫణికుమార్, శ్రీకాంత్, విశ్వప్రకాష్, రమేష్, రాజు, రఘు, వేదపండితులు బులుసు రామకృష్ణ, సతీష్, రామ జోగేశ్వరశాస్త్రి, స్వస్తివాచకులు మైలవరపు శ్రీమన్నారాయణ శర్మ, ఆంజనేయశర్మ, భీమశంకరం, ఫణిరామకృష్ణలు పూజాదికాలు జరిపించారు.

శాస్త్రోక్తంగా మంగళస్నానం

ఉదయం 5.45గంటలకు కల్యాణమూర్తులను ఆహ్వానించారు. తదుపరి భీమేశ్వర స్వామి, మాణిక్యాంబ అమ్మవార్లను వధూవరులను చేశారు. శాస్త్రోక్తంగా ముత్తయిదువులు పసుపు దంచారు. అనంతరం కల్యాణమూర్తులకు అర్చకస్వాములు మంగళస్నానం చేయించారు. వధూవరులుగా అలంకరించారు. స్వామి కల్యాణ మహోత్సవంలో సాయంత్రం 3.30కు ధ్వజారోహణం, అంకురార్పణ జరిపారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ అల్లు వెంకటదుర్గాభవానీ పర్యవేక్షణలో సిబ్బంది భక్తులకు సేవలు అందించారు. సీఐ ఎం.వెంకటనారాయణ ఆధ్వర్యంలో ఎస్ఐ ఎం.లక్ష్మణ్ ద్రాక్షారామ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఏమార్చి సొమ్ము స్వాహా

● ఏటీఎంల వద్ద సహాయం పేరుతో మోసాలు

● ఇద్దరు నిందితుల అరెస్ట్ ● 23 ఏటీఎం కార్డులు స్వాధీనం





వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ రమేశ్ బాబు, స్వాధీనం చేసుకున్న ఏటీఎం కార్డులు, నగదు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి8 (ఆంధ్రజ్యో తి): ఏటీఎంలవద్ద సహాయం పేరుతో కార్డుదారులను ఏమార్చి సొమ్ము స్వాహాచేస్తున్న ఇద్దరు అంతర్ జిల్లా కేటుగాళ్లకు ప్రకాశంనగర్ పోలీసులు చాకచక్యంగా చెక్ పెట్టారు. సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.రమేశ్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల ఏటీఎంల వద్ద మోసాలు ఎక్కువగా జరుగుతుండడంపై ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాలతో సీఐ ఆర్ఎస్‌కే బాజీలాల్ నేతృత్వంలో ఎస్ఐ ఎస్.శివప్రసాద్, క్రైం పార్టీ పీసీలు కె.ప్రదీప్‌కుమార్, ఎస్.వీరబాబుతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేసి నిఘా పెట్టారు. సుమారు 80 సీసీ కెమెరాల విశ్లేషణ అనంతరం ఏటీఎంలవద్ద కార్డు వినియోగించడంపై అవగాహన లేనివారినే లక్ష్యంగా చేసుకొని మోసాలకు పాల్పడుతున్న విజయనగరంజిల్లా పూరిటిపెంటకు చెందిన చల్లమూరి వెంకట భాస్కరరావు, పొన్నాడ కిరణ్‌లను నిందితులు గా గుర్తించారు. వీళ్ల ప్రతినెలా జీతాల సమ యమైన 1 నుంచి 8వ తేదీ వరకూ మాత్రమే.. అదీ జన సమ్మర్థం పెద్దగా ఉండని మధ్యా హ్నం వేళల్లో ఏటీఎంవద్దకు చేరుకుం టారు. ఏటీఎం వినియోగం రానివారి వద్ద మంచి వాళ్లుగా నటిస్తారు. కార్డును స్లాట్‌లోపెట్టి కార్డు దారుడు పిన్ నెంబరు చెప్పిన తర్వాత డబ్బులు తీస్తున్నట్టు ప్రయత్నిస్తారు. ఏటీఎం పని చేయడంలేదు. డబ్బులు రావడంలేదని చెబుతారు. తిరిగి కార్డుదారుడికి కార్డు ఇచ్చే సమయంలో క్షణాల్లో వేరే కార్డును చేతిలో పెడతారు. అతడు వెళ్లిన వెంటనే పిన్ నెంబరు అప్పటికే తెలుసు కాబట్టి డబ్బులు డ్రా చేసి ఉడాయిస్తారు. ప్రతినెలా 8వ తారీఖు తర్వాత ఇంటి వద్దే ఉంటూ కిరాణా కొట్టు నడుపుకుంటారు. దోచుకున్న డబ్బులను వీళ్లు ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లకు వాడుకుంటారు. వీళ్లపై ప్రకాశంనగర్ పీఎస్‌లో 3, రాజమహేంద్రవరం 2టౌన్, రాజానగరం, రావులపాలెం, ఏలూరు 3టౌన్‌లో ఒక్కోటి, విజయనగరం, విశాఖ, పెందుర్తి, విజ యవాడ, భీమిలిలో 15 కేసులు ఉన్నాయని డీఎస్పీ పేర్కొన్నారు. నిందితులవద్ద నుంచి 23 ఏటీఎం కార్డులు, రూ.2.06 లక్షల నగదు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నామని సీఐ బాజీలాల్ తెలి పారు. ఏటీఎంల వద్ద ఆదమరుపుగా ఉండొద్దని, అపరిచితుల చేతికికార్డు ఇవ్వకుండా జాగ్రత్త వహించాలని ఆయన సూచించారు. కార్డుదారులకు ఏదైనా అనుమానం వస్తే వెంటనే పోలీసులకు లేదా బ్యాంకు సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. కేసు ఛేదనలో ప్రతిభ చూపిన సీఐ బాజీలాల్ బృందాన్ని ఎస్పీ నరసింహకిషోర్ ప్రత్యేకంగా అభినందించారు. కాగా.. ఏటీఎం కార్డులను వినియోగించడం చాలా మందికి తెలియదు. చాలా ఏటీఎంలవద్ద సహాయం చేయడానికి కనీసం సెక్యూరిటీ గార్డు కూడా ఉండరు. బ్యాంకు సిబ్బంది సహాయం చేయరు. ఇదే ఆసరాగా మోసాలు జరుగుతున్నాయనడంలో సందేహంలేదు. ఏటీఎం కార్డులపై కార్డుదారుడి ఫొటో ఉంటే చాలావరకూ మోసాలకు అడ్డుకట్టవేసే అవకాశం ఉంటుంది.

బిల్డింగ్ పైనుంచి పడి వ్యక్తి మృతి



మిరియాల శ్రీనివాస్

గొల్లప్రోలురూరల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలో బిల్డింగ్ పైనుంచి పడి శనివారం సాయంత్రం వ్యక్తి అను మానాస్పద స్థితిలో మరణించాడు. కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం వాకతిప్ప గ్రామానికి చెందిన మిరియాల శ్రీనివాస్ (45) చేబ్రోలు గ్రామంలో సీహెచ్ బాబూరావు ఇంటివద్ద వైరింగ్ పనులుచేసే నిమిత్తం వెళ్లాడు. వైరింగ్ చేస్తుండగా మేడ పైనుంచి కిందకు జారిపడగా తీవ్రంగా గాయాలయ్యాయి. అతనిని కాకినాడలోని ప్రైవేటు ఆ సుపత్రికి తరలించగా అక్కడ మరణించాడు. రాత్రి వరకూ తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

కొత్తపేట సత్యసూర్య బ్యాంకర్స్

నిర్వాహకుడు పరార్

● రూ.10కోట్లు టోకరా అంటూ ప్రచారం ● ఖాతాదారులు గగ్గోలు



కొత్తపేటలో మూసేసిన సత్యసూర్య బ్యాంకర్స్ కార్యాలయం

కొత్తపేట, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): కొత్తపేట మెయిన్‌రోడ్డులో ఉన్న సత్యసూర్యబాంకర్స్ తాకట్టు వడ్డీ వ్యాపార నిర్వాహకుడు గతవారం కుటుంబ సభ్యులతో సహా పరారయ్యాడు. దీంతో ఖాతాదారులు గగ్గోలు పెడుతున్నారు. సుమారు రూ.10కోట్లు లావదేవీలు ఉన్నట్లు ప్రచారం జోరుగా సాగుతోంది. వివరాల ప్రకారం.. సత్యసూర్య బ్యాంకర్స్‌ను పదేళ్లక్రితం కొత్తపేటకు చెందిన శ్రీకాకోళపు రామకృష్ణ, శ్రీకాకోళపు నాగేశ్వరరావు, తమ్మన సూర్యప్రకాశరావులు కలిసి రూ.54 లక్షల పెట్టుబడితో వ్యాపారాన్ని ప్రారంభించి దానిని నిర్వహించేందుకు అదే గ్రామానికి చెందిన కూర్మదాసు హేమంత్‌కు అప్పగించారు. అయితే ఈ వ్యాపారం, అగ్రిమెంట్ ప్రకారం రెండేళ్లకొక్కసారి లావాదేవీలు తేల్చి లాభాలు పంచుకునే విధంగా ఒప్పందం చేసుకున్నారు. ఇదే క్రమంలో ఐదేళ్ల క్రితం భాగస్వామిగా ఉన్న తమ్మన సూర్యప్రకాశరావు తన లావాదేవీలను ముగించుకుని బయటకు వెళ్లిపోయారు. కాగా నాగేశ్వరరావు, రామకృష్ణల ఆధ్వర్యంలో హేమంత్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. గత రెండేళ్ల నుంచి లెక్కలు చెప్పకుండా కాలయాపన చేస్తున్న హేమంత్‌పై యజమానులకు అనుమానం వచ్చి వారం రోజు ల్లో లావదేవీలు చెప్పాలని తేల్చి చెప్పడంతో హేమంత్, కుటుంబసభ్యులతో సహా పరారయ్యాడు. దీంతో శ్రీకాకోళపు రామకృష్ణ ఈ వ్యవహారంపై పోలీసులకు సమాచారం ఇచ్చారు. తాకట్టు వడ్డీ వ్యాపారం మూసివేయడంతో బంగారం తాకట్టుపెట్టిన ఖాతాదారులు గగ్గొలుపెడుతున్నారు. ఇదిలావుండగా హేమంత్ ఇటీవల రియల్ ఎస్టేట్ వ్యాపారంలోకి తలదూర్చి నష్టపోయాడని ఈ ఒత్తిడిని తట్టుకోలేక కుటుంబ సభ్యులతో పరారైనట్లు ప్రచారం జరుగుతోంది. ఈవ్యవహారం రూ.10కోట్లపై మాటేనని చర్చించుకుంటున్నారు. కొందరు కుంభమేళాకు వెళ్లి ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాగా హేమంత్‌కు సంబంధించిన ఫోన్లని స్విచ్‌ఆఫ్ అవ్వడం ఇటీవలే అతని ప్లాట్, వాహనం, బంగారం అమ్మేశాడని వీటిన్నంటితో కలిపి పరారయ్యాడని కొందరు పేర్కొంటున్నారు. అయితే వ్యాపారం భాగస్వాములుగా ఉన్న వారు మాత్రం ఖాతాదారులకు నచ్చచెప్పే ప్రయత్నం చేస్తున్నారు. హేమంత్ ఆచూకీ తెలిసిన తరువాత దీనిపై ఒక నిర్ణయానికి వస్తామని ఖాతాదారులకు చెబుతున్నారు.

పిఠాపురంలో బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం

● 13 ఉమ్మడి జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు

పిఠాపురం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా పిఠాపురం పట్టణంలోని పాతబస్టాండు వద్ద గల మునిసిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో మాజీ మంత్రి కొప్పన మోహన్‌రావు, రమాదేవి స్మారక 8వ రాష్ట్ర యూత్ బాలబాలికల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు శనివారం రాత్రి ప్రారంభమయ్యాయి. బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఇన్ ఆంధ్రప్రదేశ్, ఇన్ తూర్పుగోదావరిజిల్లా, పిఠాపురం బాస్కెట్‌బాల్ ప్లేయర్స్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో ఈనెల 11వ తేదీ వరకూ జరిగే ఈ పోటీలను కాకినాడ మాజీ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ బుర్రా కృష్ణంరాజు, పిఠాపురం బాస్కెట్‌బాల్ అసోసియేషన్ డాక్టర్ మొగలి కాశీవిశ్వనాథ్‌లు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. నాలుగురోజులపాటు ఫ్లడ్ లైట్ల వెలుగులో బాలబాలికల విభాగంలో ఈ పోటీలు జరుగనున్నాయి. తొలి పోటీ ఉమ్మడి తూర్పుగోదావరి, చిత్తూరుజిల్లా బాలికల జట్ల మధ్య జరిగింది. కార్యక్రమంలో ఏపీ బాస్కెట్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి గన్నమనేని చక్రవర్తి, ఉపాధ్యక్షుడు భూషణరావు, వీఆర్ రుద్ర, ఉమ్మడిజిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు, కోఆప్షన్ సభ్యుడు గండేపల్లి బాబీ, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.



బాలబాలికల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఎంపీ గీత, బీజేపీ ఇన్‌చార్జి డాక్టర్ బుర్రా కృష్ణంరాజు, డాక్టర్ మొగలి కాశీవిశ్వనాథ్



తొలిపోటీలో తలపడుతున్న ఉమ్మడి తూర్పుగోదావరి-చిత్తూరు జిల్లాల బాలికల జట్లు

ఐఎల్ఏ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా పృథ్వీరాజ్



కాకినాడక్రైం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ (ఐఎల్ఏ) ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడిగా టి. పృథ్వీరాజ్ ఎన్నికయ్యారు. కాకినాడ బార్ అసోసియేషన్‌లో శనివారం ఐఎల్ఏ జిల్లా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా నూ తన కమిటీని రాష్ట్ర అధ్యక్షుడు జి.శాంతకుమార్ నియమించారు. అధ్యక్షుడిగా పృథ్వీరాజ్, ప్రధాన కార్యదర్శిగా పితాని వెంకటేశ్వరరావ్, ఉపాధ్యక్షుడిగా కోలా శ్రీహరిరావ్, కార్యదర్శిగా వందేవిజయరాజ్‌కుమార్,కోశాధికారిగా జేవీ రమణలతో కార్యవర్గాన్ని నియమించారు. సుప్రీంకోర్టు న్యాయవాది, ఐఎల్ఏ జాతీయ అధ్యక్షుడు చింతల శ్రీకాంత్, ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్శిటీ విశ్రాంత వీసీ డా. కె బాబ్జి, కాకినాడబార్ అసోసియేషన్ అధ్యక్షుడు ముత్తింటి విశ్వేశ్వరరావ్, న్యాయవాదులు జవహర్ అలీ, పితాని శ్రీనివాస్, పిల్లి శ్రీనివాస్, జయలక్ష్మి, సయ్యద్ షాలార్ ప్రసన్న కుమార్, రమణ, సునీత పాల్గొన్నారు.

పైడికొండ వద్ద ఆటో బోల్తా

● 17 మందికి గాయాలు

● రొయ్యల ఫ్యాక్టరీలో పనికి వెళ్తుండగా ఘటన

● అంతా పాయకరావుపేట మండలం పెదరామ భద్రపురం గ్రామస్తులు



తుని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు



సంఘటనా స్థలంలో రోధనలతో ఉన్న క్షతగాత్రులు



ప్రమాదంలో నుజ్జయిన ఆటో

తొండంగి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తొండంగి మండలం పైడికొండ గ్రామంవద్ద శనివారం ఆటో బోల్తాకొట్టిన సంఘటనలో అందులో ప్రయాణిస్తున్న 17 మంది మహిళల్లో కొందరికి తీవ్రగాయాలు కాగా మిగిలిన వారందరికీ గాయాలయ్యాయి. పోలీసులు అందించిన వివరాల ప్రకారం పాయకరావుపేట మండలం పెదరామభద్రపురం గ్రామానికి చెందిన మహిళలు ఆటోలో కృష్ణాపురం సమీపంలో ఉన్న రొయ్యల ఫాక్టరీలో పనిచేసేందుకు ఆటోలో బయలుదేరారు. పాల్తేరు, ఆనూరు, పైడికొండ మీదుగా ఫాక్టరీకి వస్తుండగా పైడికొండ చెరువు వద్ద మలుపులో ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న మహిళలంతా కిందపడి తీవ్ర గాయాలతో హాహాకారాలు చేయడంతో స్థానికులు స్పందించి సహాయాన్ని అందించారు. మహిళల రోదనలతో ఆప్రాంతమంతా మార్మోగింది. స్థానికులు, పోలీసులు క్షతగాత్రులను తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆటో బోల్తాకొట్టిన ప్రాంతంలో వారు తెచ్చుకున్న భోజనం క్యారియర్‌లు ఛిద్రమై చెల్లాచెదురుగా పడి ప్రమాద తీవ్రతను తెలుపుతున్నాయి. నక్కిన లక్ష్మి, కనకం దేవి, మంతిన రమణమ్మ, పులిలోవకుమారి, గెడ్డమూరి సీతారత్నం, కోటిన లక్ష్మి, ఏ.చిన్నమ్ములు, ఎన్. లక్ష్మి, జీలం పద్మ, తుంపాల అనంతలక్ష్మి, ఉగ్గిన దేవి, ఉగ్గిన సత్యవతి, నంగిన పద్మ, శీలం ధనలక్ష్మి, కర్రి లక్ష్మి, నారిపిరెడ్డి నాగమణిలకు గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ పట్నాల సంతోష్ కు స్వల్ప గాయాలయ్యాయి. బాధితులంతా తుని ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. తొండంగి ఎస్ఐ జగన్మోహన్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. రోజూవారీ వచ్చే డ్రైవర్ కాకుండా వేరే వ్యక్తి డ్రైవర్‌గా రావడం వలన ఈ రూటుపై అవగాహనలేక ప్రమాదం జరిగిందని స్థానికులు అంటున్నారు.

దొంగలున్నారంటూ దోపిడీ

● చెవి దిద్దులు అపహరణ ● ఆటో డ్రైవర్ అరెస్ట్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మహిళను ఏమార్చి చెవిదిద్దులు దొంగిలించిన ఆటో డ్రైవర్‌ను ప్రకాశ్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. డీఎస్పీ కె.రమేశ్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. నామవరం బీ బ్లాక్‌కు చెందిన చొల్లంగి విజయకుమార్ ఆటో నడుపుతుంటాడు. రాజేంద్రనగర్‌కి చెందిన ఓ మహిళ ఈ నెల1న రాత్రి 7గంటల సమయంలో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఆటో ఎక్కారు. కొంతదూరం వెళ్లిన తర్వాత ఆ దారిలో దొంగతనాలు జరుగుతున్నాయని, ఒంటిపై బంగారు వస్తువులు దాచుకోవాలని ఆమెతో విజయకుమార్ చెప్పాడు. ఆమె వాటిని కాగితంలో చుట్టి బ్యాగ్‌లో పెడుతున్న సమయంలో దొంగిలించి ఆమెను ఘటనా ప్రదేశంలో వదిలేసి వెళ్లిపోయాడు. దీనిపై ఆమె అదేరోజున ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. సీఐ ఆర్ఎస్‌కే బాజీలాల్ నేతృత్వంలో ఎస్ఐ శివప్రసాద్, హెచ్‌సీ ఎన్.రాంబాబు, క్రైం పార్టీ పీసీలు కె.ప్రదీప్‌కుమార్, ఎస్.వీరబాబుతో ఎస్పీ నరసింహకిషోర్ ప్రత్యేక పోలీసు బృందాన్ని ఏర్పాటు చేశారు. దర్యాప్తులో విజయ్‌కుమార్‌ను నిందితుడిగా గుర్తించి అరెస్టు చేశామని డీఎస్పీ వివరించారు. ఆమె వద్ద నుంచి దోచుకున్న 4గ్రాముల చెవిదిద్దులు, నేరానికి వినియోగించిన ఆటోను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిపై 2019లో బొమ్మూరు పోలీస్‌స్టేషన్లో కేసు ఉందన్నారు. వాహనాల్లో ప్రయాణించే సమయంలో పరిచయం లేని వ్యక్తులతో జాగ్రత్తగా వ్యవహరించాలని సీఐ బాజీలాల్ సూచించారు.

ఉల్లాస్‌మేళాలో కాకినాడ జిల్లా ఉపాధ్యాయులకు అభినందన



ఉల్లాస్‌మేళాలో ఉపాధ్యాయులు గోవిందరాజులు తయారు చేసిన పప్పెట్లను ప్రదర్శిస్తున్న దృశ్యం

గొల్లప్రోలురూరల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఉల్లాస్‌మేళాలో కాకినాడజిల్లా ఉపాధ్యాయులు పాల్గొన్నారు. గొల్లప్రోలు మండలం చెందుర్తి మండలపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు పిల్లి గోవిందరాజులు వయోజన విద్యపై తయారు చేసిన పప్పెట్లను కొత్తపల్లి పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు దాకే అప్పలరాజుతో కలిసి ఈ మేళాలో ప్రదర్శించారు. వీటిని జాతీయ వయోజన విద్యాశాఖ డైరెక్టర్ ప్రదీప్ హడ్హా, ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్, వయోజన విద్యాశాఖ డైరెక్టర్ కృతికాశుక్లాలు పరిశీలించి అభినందించారు. వీరికి ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఢిల్లీలో బీజేపీ గెలుపుపై విజయోత్సవ సంబరాలు




కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకుంటున్న బీజేపీ నాయకులు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంతో ఆ పార్టీ శ్రేణులు శనివారం సంబరాలు జరుపుకున్నాయి. రాజమహేంద్రవరంలోని బీజేపీ కార్యాలయం వద్ద నాయకులు కేక్ కట్ చేశారు. స్వీట్లు పంచారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు, పీవీఎన్ మాధవ్, బొమ్ముల దత్తు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, అడబాల రామకృష్ణ, ఎనుముల రంగారావు, హారిక, బూర రామచంద్రరావు పాల్గొన్నారు. కాగా, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపు తమకు ఎంతో సంతోషానిచ్చిందని, అవినీతి కేజ్రీవాల్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పారని సోము వీర్రాజు, మాధవ్ పేర్కొన్నారు.

రాజానగరం: ఢిల్లీలో బీజేపీ అఖండ విజయం సాధించిన సందర్భంగా ఆ పార్టీ మండలశాఖ అధ్యక్షుడు ఆళ్ల శివనాగరాజు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు శనివారం సంబరాలు చేసుకున్నారు. ఈసందర్భంగా ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ఏపీఆర్ చౌదరి, అసెంబ్లీ కన్వీనర్ నీరుకొండ వీరన్నచౌదరి, కోకన్వీనర్ అడబాల గణపతిరావు, ప్రధాన కార్యదర్శులు సంగిశెట్టి సత్యనారాయణ, తెల్లమేకల బిందుశేఖర్, మండల ఉపాధ్యక్షులు బొరుసు వెంకటేశ్వరరావు, బిక్కిన కామరాజు చౌదరి, అబ్బారెడ్డి, ఉల్లి శివ, ముక్కపాటి శివ కృష్ణ, ప్రగడ మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై గొంతెత్తి

నినదించేది పీడీఎఫ్ ఎమ్మెల్సీలే

● ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న పీడీఎఫ్ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అధికార, ప్రతిపక్షాల్లో చేరకుండా ప్రజాసమస్యల పరిష్కారంలో గొంతెత్తి నినదించేది పీడీఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రమే అని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం ఆనం రోటరీ హాలులో ప్రజా సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ఉభయగోదావరి జిల్లాల పీడీఎఫ్ పట్టభద్రుల అభ్యర్థి డీవీ రాఘవులు పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు వంతపాడడంతో నిరుద్యోగులు, పేదలు, నిమ్నవర్గాలు ఉపాధి అవకాశాలులేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని విమర్శించారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ డీఎస్సీ నియామకాల కోసం ఎన్నికల్లో మాటిచ్చినా నేటికీ అతీగతీలేదని అన్నారు. కుంటిసాకులు చెబుతూ డీఎస్సీ వాయిదా వేస్తున్నారని ఆరోపించారు. విజన్-2047 అంటూ కార్పొరేట్లకు లబ్ధి చేకూరేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు సంబంధించి సీపీఎస్ రద్దు, ఓపీఎస్ అమలు, నూతన పీఆర్సీ కమిటీ ఏర్పాటు వంటి సమస్యలపై కూడా ప్రభుత్వం ఉదాసీన వైఖరి ప్రదర్శిస్తోందని ఐవీఆర్ అన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి రాఘవులు మాట్లాడుతూ తనను గెలిపిస్తే ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి టి.అరుణ్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు ఎస్.అరుణకుమారి, జ్యోతిబసు, కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మాణిక్యం మాట్లాడారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.జయకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా నాయకుడు జువ్వల రాంబాబు, జేఏసీ జిల్లా నాయకుడు ప్రవీణ్, అంగన్వాడీ రాష్ట్ర నాయకురాలు బేబీరాణి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి షరీఫ్, సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

'నర్సరీ' అసోసియేషన్ నూతన పాలకవర్గం

●అధ్యక్షుడిగా రత్నం అయిప్ప ● ఉపాధ్యక్షుడిగా బోడపాటి గోపాలకృష్ణ ఎన్నిక




రిజిస్టర్‌లో సంతకం పెట్టి బాధ్యతలు స్వీకరిస్తున్న రత్నం అయ్యప్ప

అధ్యక్షుడిని అభినందిస్తున్న నర్సరీ ప్రతినిధులు, నర్సరీ రైతులు

కడియం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కడియం సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ నూతన పాలకవర్గం శనివారం కొలువుదీరింది. ఏడాదిన్నర క్రితం జరిగిన జంటిల్‌మెన్ ఒప్పందం ప్రకారం రత్నం అయ్యప్ప అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు అధ్యక్షుడిగా ఉన్న మల్లు పోలరాజు పదవీకాలం ముగియడంతో నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. జనసేన పార్టీకి చెందిన రత్నం అయ్యప్ప జనసేన రాష్ట్ర కార్యదర్శిగా పదవిలో ఉన్నారు. అయ్యప్పకు పవన్ కల్యాణ్‌తో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. అందుకే ఆయన సమక్షంలో ప్రమాణ స్వీకార మహోత్సవం చేయడానికి నెల రోజుల క్రితమే ఆహ్వానించారు. మార్చి 2వ తేదీన పవన్‌కల్యాణ్ రానున్నారు. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, జనసేన ప్రముఖులు, నర్సరీ ప్రతినిధులు, ప్రముఖులు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా ప్రమాణ స్వీకార మహోత్సవం జరగనుంది. అసోసియేషన్ అధ్యక్షులుగా రత్నం అయ్యప్ప, ఉపాధ్యక్షుడిగా బోడపాటి గోపాలకృష్ణ, కార్యవర్గ సభ్యులుగా తాడాల నాగేశ్వరరావు, కొండేపూడి నాగు, గాద నాగేశ్వరరావు, గాజుల రత్తయ్య, పిల్లా శ్రీనివాస్, మల్లు శివన్నారాయణ, బోడపాటి సత్తిబాబు, అడ్డగర్ల రమేష్, పాటంశెట్టి శేషకుమార్, రత్నం మహాలక్ష్మి(బాబ్జి), కోఆప్షన్ మెంబర్‌గా క్రొవ్విడి వాసులు ఎన్నికయ్యారు.

సేంద్రియ ఎరువులపై రైతులకు అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న కేవీకే హెడ్ వీఎస్జీఆర్ నాయుడు

రాజానగరం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువుల వాడకంతో సాగులో ఖర్చు ఆదాతో పాటు అధిగ దిగుబడులు సాధించవచ్చని కేవీకే హెడ్ వీఎస్జీఆర్ నాయుడు పేర్కొన్నారు. కలవచర్ల కృషీవిజ్ఞాన కేంద్రం (కేవీకే) గాయత్రి ఇన్నోవేటివ్ ఎనర్జీస్ ప్రైవేట్ లిమిటెడ్, తూర్పుగోదావరి వారి సంయుక్త ఆధ్వర్యంలో పులియబెట్టిన సేంద్రియ ఎరువులపై శనివారం రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మన దేశంలో పురాతన కాలం నుంచి సేంద్రియ ఎరువుల వాడకం ఉందని, ప్రస్తుత యాంత్రీకరణ సాగులో రసాయన ఎరువులు విపరీతంగా వాడడం వల్ల భూమికి తీవ్రనష్టం వాటిల్లుతోందన్నారు. గాయత్రి ఇన్నోవేటివ్ ఎనర్జీస్ ప్రైవేట్ లిమిటెడ్ అధికారులు సత్యనారాయణ, శ్రీకాంత్ పులియబెట్టిన సేంద్రియ ఎరువుల వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. అనంతరం కేవీకే దూరదర్శన్ ప్రచారం చేసిన నూతన వ్యవసాయ సాంకేతికతలపై కృషి చౌపాల్ మూడవ ఎపిసోడ్‌ను రైతులు వీక్షించారు. సస్యరక్షణాధికారి రఘునందన్, పశువైద్యాధికారి డాక్టర నాగేశ్వరెడ్డి, మత్స్యశాఖ అధికారి రవీంద్ర సొంటెక్కే, గృహ విజ్ఞానాధికారి సంజయ్ హెగ్డే, గాయత్రి ఇన్నో వేటివ్ ఎనర్జీస్ ప్రైవేట్ లిమిటెడ్ అధికారులు సత్యనారాయణ, శ్రీకాంత్మరియుప్రసాద్, పలువురు రైతులు పాల్గొన్నారు.

దుళ్లలో వెంకన్న కల్యాణం

కడియం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): దుళ్లలోని శ్రీభూసమేత శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఏకాదశి పర్వదినాన వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. స్వామి వారు పెండ్లి కుమారుడిగా, అమ్మవారు పెండ్లి కుమార్తెగా భక్తులకు దర్శనమిచ్చారు. వందలాది మంది భక్తులు పెళ్లి పెద్దలుగా హాజరై కల్యాణాన్ని కనులారా వీక్షించి తరించారు. పెద్దఎత్తున భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిని ప్రక్షాళన చేయాలి

- ప్రత్యేకాధికారికి టీడీపీ నేతల వినతి



ప్రభుత్వ బోధనాసుపత్రి స్పెషలాఫీసర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నేతలు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి (జీటీజీహెచ్)లో అవినీతి పెరిగిందని, వైద్యులు, వైద్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం చూపుతున్నారని, ప్రభుత్వాసుపత్రిని పూర్తిగా ప్రక్షాళన చేయాలని టీడీపీ నగర కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి మరుకుర్తి రవియాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ప్రభుత్వాసుపత్రి ప్రత్యేకాధికారి భాస్కరరెడ్డికి పార్టీ నాయకులు అజ్జరపు రమేష్, కొత్తల కిషోర్ తదితరులతో కలసి వినతిపత్రం ద్వారా ఫిర్యాదు చేశారు. రాజమహేంద్రవరం జిల్లా ఆసుపత్రికి ఎంతో మంది వైద్యం కోసం వస్తుంటారని, ఎక్కడెక్కడి నుంచో వస్తున్న వారికి వైద్యం సక్రమంగా అందడంలేదన్నారు. ఇటీవల సీతానగరం మండలం శ్రీరామనగర్‌కు చెందిన గుండుబోగుల సత్తిబాబు అనే వ్యక్తి సకాలంలో వైద్యం అందక మృతిచెందాడని, అతడి మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని మృతుడి బంధువులు ఆరోపిస్తున్నారని తెలిపారు. ఈ విషయంలో సమగ్ర విచారణ చేసి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఆసుపత్రి మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించే వైద్యుడికి సహాయకుడిగా అవుట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న ఉద్యోగి అక్రమాలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దీనిపైనా సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో టీడీపీ నాయకులు కోరారు.

బీజేపీ విజయం అభివృద్ధికి నిదర్శనం

● నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, అనపర్తి ఎమ్మెల్యే



అనపర్తి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ వాసులు అవినీతి పాలనను అంతమొందించారు. దేశంలో ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్న అభివృద్ధిని చూసి బీజేపీకి పట్టంకట్టారు. ఆప్‌ను చీపురుతో ఊడ్చి అభివృద్ధికి బాటలు వేసుకున్నారు.

'పేరాబత్తుల' ను అత్యధిక మెజార్టీతో గెలిపిద్దాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నెహ్రూ

గోకవరం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపిద్దామని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ పిలుపునిచ్చారు. గోకవరంలో శనివారం ఎన్నికల సమాయత్త సమావేశాన్ని నిర్వహించారు. దీనికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. మొదటి ప్రాధాన్యత ఓటేసి రాజశేఖరాన్ని గెలిపించాలని కోరారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనివాసుడి కల్యాణం



పందలపాకలో వధూవరుల అలంకారంలో స్వామి అమ్మవార్లు

బిక్కవోలు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): భీష్మఏకాదశి సందర్భంగా పందలపాకలోని శ్రీఅలివేలు మంగా, పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కల్యాణకర్తలుగా గ్రామానికి చెందిన దామిశెట్టి మహేష్‌కుమార్ విజయదుర్గాభవాని వ్యవహరించారు. ఆలయ ధర్మకర్త పడాల అబ్బులురెడ్డి మాట్లాడుతూ యాభై యేళ్లుగా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, పెళ్లికానివారు స్వామిని కొలిస్తే పెళ్లి అవుతుందని ఇక్కడి భక్తుల ప్రగాఢ నమ్మకం. అనంతరం మూడువేల మందికి అన్నదానం జరిపారు.

మంత్రి దుర్గేష్‌ను కలిసిన రాకా సభ్యులు



మంత్రి కందుల దుర్గేష్‌తో ఉన్న రాకా సభ్యులు

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కళల రాజధాని రాజమహేంద్రవరంలో విక్రమ్‌దేవ్ వర్మ తొంభై ఏళ్ల క్రితం స్థాపించిన విక్రమ హాల్ నేటికీ సంగీత సాహిత్య కార్యక్రమాలకు వేదికగా ఉందని, గత చరిత్రపై గోదావరి కల్చరల్ క్లబ్ రాకా సంస్థలు, సావనీర్ రూపంలో నగర ప్రజలకు తెలియజేసే విధంగా ముద్రించారు. దానిని ఆవిష్కరించేందుకు రావాలని మంత్రి దుర్గేష్‌ను శనివారం కలిసి ఆహ్వానించారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు.

ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల సందర్శన

స్థానిక ప్రభుత్వ భాష, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలోని విజయ శంకర ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలను శనివారం రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్,రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక కమిషన్ చైర్‌పర్సన్ పొడపాటి తేజశ్రీ సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థులతో సంభాషించారు.

సింహాచలనగర్‌లో

ఘనంగా శ్రీవారి చక్రస్నానం



స్వామివారికి పూజలు చేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక సింహాచలనగర్ శ్రీ వరాహలక్ష్మీ నృసింహస్వామి క్షేత్ర చందనయాత్ర మహోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీవారి చక్రస్నానం ఘనంగా జరిగింది. ధర్మకర్తలు కాలెపు నాగేశ్వరరావు పర్యవేక్షణలో ఆలయార్చకుల వేద మంత్రోచ్ఛారణ మధ్య ఆలయ ఆవరణలో ఉన్న కోనేరులో శ్రీవారి చక్రస్నానం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం ఆరాధన, హోమాలు, నిత్యరూప దర్శనం జరిగాయి.

వైభవంగా దేవీచౌక్ వార్షికోత్సవ వేడుకలు



పూర్ణాహుతిలో భక్తులు

రాజానగరం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : చక్రద్వార బంధంలోని దేవీచౌక్ 18వ వార్షికోత్సవ వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో కొలువుదీరిన కనకదుర్గమ్మకు చండీహోమం, మండపారాధన, పంచామృత, పాలాభిషేకాలు, ప్రత్యేకపూజలు, అర్చనలు జరిపారు. అనంతరం జరిగిన భారీ అన్నసమారాధనలో గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ముగిసిన పునాది అభ్యసన శిక్షణ తరగతులు



ఉపాధ్యాయులకు జ్ఞాపిక అందిస్తున్న ఏఎంవో గౌరీశంకర్

దివాన్‌చెరువు, ఫిబ్రవరి8 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక తరగతులలో విద్యార్థులకు అభ్యసన ఫలితాలకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా సమగ్రశిక్ష అకడమిక్ మోనటరింగ్ అధికారి డీ.గౌరీ శంకరరావు ఉపాధ్యాయులను కోరారు. రాజానగరం మండలం కొండగుంటూరులోని సత్యశ్రీ పరిమళ పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతున్న 9వ విడత పునాది అభ్యసన శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ఆయన మాట్లాడుతూ శిక్షణ తరగతులలో నేర్చుకున్న అంశాలన్నీ విద్యార్థులచేత ప్రాక్టీస్ చేయించి అభ్యసన ఫలితాలు రాబట్టాలని సూచించారు. అల్లూరిసీతారామరాజు జిల్లా నుంచి 168 మంది, కాకినాడ జిల్లా నుంచి 95 మంది, తూర్పుగోదావరి జిల్లా నుంచి 15 మంది ఒకటో తరగతి బోధించే ఉపాధ్యాయులు శిక్షణకు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంఈవోలు రామకృష్ణ, వై.నాగేశ్వరరావు, డైట్ లెక్చరర్ రాజేష్, తరల్, ప్రథమ్ జిల్లా కోఆర్డినేటర్లు తరమ్, అనూష, అల్లూరి సీతారామరాజు, కాకినాడ జిల్లాల నుంచి ఒక్కొక్క కేఆర్పీ, 22 మంది డీఆర్పీలు పాల్గొన్నారు. టీఎల్ ఎంను ఉత్తమంగా తయారుచేసిన ఉపాధ్యాయులను ఎంపిక చేసి జ్ఞాపికలను, డీఆర్పీలకు సన్మానం చేసారు.

కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కత్తితో బెదిరించి బంగారం దోపిడీ

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కత్తితో బెదిరించి ఇద్దరు యువకులను దోపిడీ చేయడంపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం.. వర్క్ ఫ్రం హోం చేస్తున్న ఆర్యాపురానికి చెందిన సుమన్ తన స్నేహితుడు రవితేజతో కలిసి శుక్రవారం అర్ధరాత్రి వేళ పీఅండ్‌టీ కాలనీకి వెళుతున్నారు. కోరుకొండ రోడ్డు మార్కెట్ యార్డు సమీపంలో మంకీక్యాప్స్ వేసుకున్న ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై వచ్చి అటకాయించారు. కత్తి చూపించి డబ్బులు తీయాలని బెదిరించారు. డబ్బులు లేవని చెప్పడంతో ఇద్దరి ఒంటిపై ఉన్న ఒక గొలుసు, రెండు ఉంగరాలు కలిపి సుమారు నాలుగు కాసుల బంగారు వస్తువులు లాక్కొని ఉడాయించారు. వాళ్ల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ పేర్కొన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు యువకులు బైక్‌పై వేగంగా వచ్చి ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందడంపై ప్రకాశం నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ బాజీలాల్ తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడకు చెందిన ఈదల త్రినాథరావు(55) రాజమహేంద్రవరంలోని లాలాచెరువు సమీపంలోని స్పిన్నింగ్ కాలనీలో పని చేస్తున్నారు. శుక్రవారం రాత్రి టిఫిన్ కోసం లాలాచెరువు క్వారీ మార్కెట్ రోడ్డు జంక్షనుకు వచ్చారు. టిఫిన్ సెంటర్‌కి కాలినడకన జంక్షను దాటుతుండగా బైక్‌పై వేగంగా వచ్చిన ఇద్దరు యువకులు ఢీకొట్టారు. ఆయనను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచారు.

కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

వాడవాడలా భక్తిశ్రద్ధలతో భీష్మఏకాదశి



దివాన్‌చెరువులో భజనలు చేస్తున్న భక్తులు

దివాన్‌చెరువు, ఫిబ్రవరి8 (ఆంధ్రజ్యోతి) : భీష్మఏకాదశి పర్వదినం సందర్భంగా దివాన్‌చెరువు, పాలచర్ల, తుంగపాడు, తదితర గ్రామాలలో శనివారం భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. దివాన్‌చెరువులోని శ్రీరాధాకృష్ణస్వామి ఆలయం, పాలచర్లలోని శ్రీకనకదుర్గమ్మ ఆలయాలలో ఏకాహం చేశారు.

రాజానగరం: భీష్మఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామా ల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. దీనిలో భాగంగా భక్తులు వేకువజామునే పుణ్యస్నానా లు ఆచరించి, పూజలు చేశారు. చక్ర ద్వార బంధం, రాధేయపాలెం, రాజానగరం, పల్లకడి యం.నరేంద్రపురం, తూర్పుగోనగూడెం, పరి జెల్లిపేట, కానవరం, తదితర గ్రామాల్లోని ఆలయాలు భక్తుల రద్దీతో దర్శనమిచ్చాయి.

గోకవరం: మండలంలోని పలుగ్రామాల్లో భీష్మఏకాదశి వేడుకలు శనివారం ఘనంగా జరి గాయి. తెల్లవారు ఝామునుంచే ప్రము ఖ దేవాలయాలన్నీ భక్తులతో కిటకిటలా డాయి. ముఖ్యంగా తంటికొండ వెంకన్న ఆలయం, గుమ్మళ్లదొడ్డిలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం, సత్యనారాయణస్వామి దేవస్థానం, గోకవరంలో దేవి ఆలయం, శివాలయం, తదితర ఆలయాలు ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులతో నిండి పోయాయి. జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ తంటికొండ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు.

● కంబాల భారీ విరాళం

రంపయర్రంపాలెంలో ప్రారంభమైన పాండవుల తీర్థానికి విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు కంబాల శ్రీనివాసరావు హాజరై పాండవుల విగ్రహాలను దర్శించుకున్నారు. ఈయనకు నిర్వహకులు ఘన స్వాగతం పలికి పాండవుల మెట్ట విశిష్టతను వివరిం చారు. అనంతరం అన్నదాన నిమిత్తం రూ.1,11, 000 విరాళాన్ని కమిటీ సభ్యులకు శ్రీనివాసరావు అందజేశారు.



అన్నదానం నిమిత్తం విరాళాన్ని అందజేస్తున్న కంబాల శ్రీనివాసరావు

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: సంక్రాంతికి వస్తున్నాం
సూర్యామినీ	: బడాస్ రవికుమార్
సూర్యాప్యాలస్	: పట్టుదల
స్వామి	: సంక్రాంతికి వస్తున్నాం
శివజ్యోతి	: తండేల్
అనుశ్రీ(సాయికృష్ణ)	: ఒక పథకం ప్రకారం, మదగజరాజు
రాజా	: తండేల్
ఊర్వశి	: డాకు మహరాజ్
రంభ	: ఒక పథకం ప్రకారం, మార్కో
మేనక	: గేమ్ ఛేంజర్
అప్సర	: తండేల్
కుమారి	: తండేల్
అశోక	: పట్టుదల
వీఎస్ మహాల్(నామవరం)	: తండేల్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: తండేల్
వెంకటసూర్య(కడియం)	: తండేల్
సత్యగౌరి (అనపర్తి)	: సంక్రాంతికి వస్తున్నాం
సూర్యశ్రీ (అనపర్తి)	: తండేల్
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: తండేల్
రామకృష్ణ(కోరుకొండ)	: తండేల్
గీతాసినిమాస్ (సీతానగరం)	: తండేల్
శ్రీనివాస (గోకవరం)	: తండేల్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: ....
లలితామహాల్(రంపచోడవరం)	: తండేల్
నవయుగ (చింతూరు)	: తండేల్

ఊరేగిన నరసింహుడు



నరసన్న రథం లాగుతున్న భక్తజనం

ఉత్సవమూర్తులు

తనివితీరా స్నానం చేసి..కనులారా స్వామిని చూసి.. మనసారా దర్శించుకున్నారు.. అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది..లక్ష్మీ నరసింహుడికి ఆలయం నుంచి పెద్ద ఎత్తున భక్తజనం మధ్య రథం కదిలింది.. స్వామిని భక్తజనం ఓం నమో నారసింహాయ అంటూ ఊరంతా కలియతిప్పారు.. తమ చెంతకు వచ్చిన స్వామిని దర్శించుకుని భక్తజనం తన్మయత్వం చెందారు.. స్వామికి హారతులు పట్టారు.. కాపాడు స్వామి అంటూ వేడుకున్నారు.. - 6లో





కల్యాణ..భీమేశ్వరుడు

బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామంలో భీమేశ్వరుడి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ముందుగా ఉత్సవమూర్తులకు మంగళస్నానం జరిపించారు. మూలవిరాట్ భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ, క్షేత్ర పాలకులు శ్రీలక్ష్మీ సమేత నారాయణస్వామి, శ్రీ చండికా సమేత సూరేశ్వరస్వామికి శనివారం రాత్రి 11:05 గంటలకు కల్యాణం జరిపించారు.. పెద్ద ఎత్తున హాజరైన భక్తజనం ఆసక్తిగా కల్యాణక్రతువు తిలకించారు.. ఓం నమో భీమేశ్వరాయ అంటూ కొలిచారు..

వాట్సప్‌లో హాయ్ అని పెడితే..

ఆర్టీసీ టికెట్

నిడదవోలు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : వాట్సప్ నుంచి ఏదైనా చేయవచ్చు.. ప్రభుత్వ పౌర సేవలే కాదండోయ్..ఆర్టీసీ టిక్కెట్లు బుక్‌చేసుకోవచ్చు. 9552300009 అనే వాట్సప్ నెంబరుకు హాయ్ అనే మెసేజ్ చేస్తే ఆర్టీసీ సేవలు అందుబాటులోకి వస్తాయి. దీని ద్వారా ప్రయాణికులు చేరవలసిన ప్రదేశానికి టికెట్‌ను డిజిటల్ మనీ చెల్లింపు ద్వారా బుక్ చేసుకోవచ్చు. అనంతరం మీరు ఇచ్చిన నెంబర్‌కు బస్ టికెట్ వాట్సప్‌లో వస్తుంది.ప్రభుత్వం ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యార్థం వాట్సప్ ద్వారా టికెట్ బుకింగ్ సేవలను అందుబాటులోకి తెచ్చిందని నిడదవోలు డీఎం కె.వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. సేవలను ప్రయాణికులు సద్వినియోగపర్చుకోవాలన్నారు.



పాండవుల మెట్టపై భక్తుల పూజలు

రంపయర్రంపాలెంలో పాండవుల తీర్థం

గోకవరం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి) : భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని రంపయర్రంపాలెంలో పాండవుల తీర్థం శనివారం ప్రారంభమైంది. పాండవుల మెట్టపై గుహల్లో ఉన్న ద్రౌపతిదేవి, పాండవుల విగ్రహాలకు ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ తీర్థం కోసం పాం డవుల మెట్టను నిర్వాహకులు సర్వాంగా సుందరంగా తీర్చిదిద్దారు.తీర్థానికి ఎక్కడె క్కడి నుంచో భక్తజనం తరలి వస్తారు. ఉత్సవాల్లో భాగంగా పాండవుల మెట్ట చుట్టూ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. విశ్వ హిందూ దర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు పాండవుల విగ్రహాలను దర్శించుకున్నారు.అన్నదాన నిమిత్తం రూ. 1,11,000 విరాళం అందజేశారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.

బాలికను వేధిస్తున్న యువకుడిపై పోక్సో కేసు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): బాలికను వేధింపులకు గురిచేస్తున్న యువకుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. శాంతి నగర్‌కి చెందిన బుంగా సతీశ్ ప్రతి రోజూ అదే వీధికి చెందిన ఓ బాలిక (15) వెంటపడి వేధిస్తున్నాడు. బాలిక తల్లి ఎన్నిసార్లు హెచ్చరించినా పట్టించుకోవడంలేదు. దీంతో ఆమె శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశామని సీఐ అప్పారావు తెలిపారు.

కిలోతో పట్టుబడినా.. పదేళ్లు!

గంజాయి కేసులో చిక్కితే.. జీవితం జైలుకే



గంజాయి ఎక్కడ పట్టుబడినా మూలాలు మాత్రం తూర్పువే.. ఎందుకంటే గంజాయి ఎక్కువగా సాగయ్యేది తూర్పు ఏజెన్సీలోనే.. ఇక్కడి నుంచే దేశవ్యాప్తంగా సరఫరా చేస్తున్నారు.. కేసుల్లో నిందితులుగా ఉన్నవారు మన జిల్లాకు చెందిన వారే ఎక్కువ.. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులోనే గంజాయి కేసుల్లో చిక్కిన 400 మంది వరకూ ఉన్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇప్పటి వరకూ ఎన్‌డీపీఎస్ యాక్ట్ ఉన్నా చూసీచూడనట్టు వదిలేస్తున్నారు.. గంజాయి కేసులో చిక్కినా బెయిల్‌పై బయటకు వచ్చేసి తిరుగుతున్నారు.. ఇక నుంచి అలా కుదురదు.. గంజాయి కేసులో చిక్కితే జీవితం జైలుకే.. ఒక నెలో.. రెండు నెలలో కాదు.. 20 కిలోల లోపు గంజాయితో పట్టుబడినా 20 ఏళ్లు తప్పదు.. ఇప్పటికే ఈ చట్టం కింద అనకాపల్లి జిల్లా న్యాయస్థానం 20 కిలోల గంజాయి రవాణా కేసులో ఇద్దరికి 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. ఇటీవల ఓ స్మగ్లరు గంజాయి అక్రమ వ్యాపారంలో కూడబెట్టిన రూ.2 కోట్ల ఆస్తులను ప్రభుత్వం జప్తు చేసింది. రెండు కేసుల్లో నిందితులుగా ఉంటే మరణదండనే..అదనపు ఆదాయానికి ఆశపడి గంజాయి కేసులో చిక్కారో.. ఇక జీవితం అంతే.. తస్మాత్ జాగ్రత్త!

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

గంజాయి కేసులో చిక్కితే జీవితం కటకటాల పాలే.. బయటకు వచ్చేదారుండదు.. బెయిల్ వచ్చే అవకాశం ఉండదు. అంతలా చట్టాలను కట్టుదిట్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచే గంజాయి నిర్మూలన దిశగా యుద్ధం మొదలుపెట్టింది. 'ఈగిల్' పేరుతో ఓ ప్రత్యేక పోలీసు బృందాన్ని ఏర్పాటు చేసింది. మరో వైపు నార్కొటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సస్ యాక్ట్(ఎన్‌డీపీఎస్) అత్యంత పదునైన చట్టం. దీంతో గంజాయి కేసుల్లో మరణ దండన విధించే అవకాశం ఉంది. దీనిపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

దొరికితే జీవితానికి పొగ

గంజాయి కేసులు ఎన్‌డీపీఎస్ చట్టం పరిధిలోకి వస్తాయి. గంజాయి ఇతర నిషేధిత మాదకద్రవ్యాల సాగు, విక్రయించడం, కొనుగోలు, రవాణా,కాల్చడం(వినియోగం),నిల్వ..ఇవన్నీ ఎన్‌డీపీఎస్ చట్టం కిందకే వస్తాయి. గంజాయి కేసుల్లో ఎన్‌డీపీఎస్ చట్టం ద్వారా పట్టుబడిన పరిమాణాన్ని బట్టి కఠినమైన శిక్షలు ఉంటాయి. బెయిల్ రాకపోవడమే కాకుండా శిక్షను పూర్తిగా అనుభవించాల్సిందే.శిక్ష ఖరారైన ఖైదీకి ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమాభిక్ష ఉండదు.సాధారణంగా ఏ కేసులోనైనా నేరాన్ని పోలీసులు, ప్రాసిక్యూషన్ రుజువు చేయాల్సి ఉంటుంది. కానీ ఎన్‌డీపీఎస్ కేసులో తాను నేరం చేయలేదని నిందితుడే నిరూపించుకోవాలి. తెలిసి చేసినా,తెలియక చేసినా విష వలయంలో చిక్కు కున్నట్టే.ఈ కేసుల్లో ఒక్కసారి చిక్కితే కేంద్ర హోంశాఖ నిర్వహించే నేషనల్ ఇంటి గ్రేటెడ్ డేటాబేస్ ఆన్ అరెస్టెడ్ నార్కో-అఫెండర్స్ (నిదాన్) పోర్టల్‌లో పేరు నమోదవుతుంది. ఆ జాబితాలో ఉన్న వాళ్లకు పాస్‌పోర్ట్ జారీ చెయ్యరు. అంటే దేశం దాటడానికి లేకుండా గేట్లు మూసేసినట్టే.

కూటమి యుద్ధం ఇలా

గంజాయిపై యుద్ధానికి కార్యాచరణకు కూటమి ప్రభుత్వం ఇప్పటికే యాంటీ నార్కొటిక్ టాస్క్‌ఫోర్స్(ఏఎన్‌టీఎఫ్) అవసరమైన సిబ్బంది, సంపత్తితో రంగంలోకి దిగింది. కేంద్ర ఇంటెలిజెన్స్ బ్యూరో పని చేసి సమర్థవంతమైన అధికారిగా గుర్తింపు తెచ్చుకున్న ఐజీ ర్యాంకు అధికారి ఆకే రవికృష్ణను ఏఎన్‌టీఎఫ్ అధిపతిగా నియమించింది. మత్తు పదార్థాల నిల్వ, స్మగ్లింగ్, విక్రయాలతో పాటు గంజాయి సాగు, సరఫరా, వినియోగానికి సంబంధించిన సమాచారాన్ని సేకరిస్తోంది. టోల్ ఫ్రీ నంబరును ఏర్పాటు చేసి కచ్చితమైన సమాచారం ఇచ్చిన వారికి నగదు బహుమతి అందజేసే ఏర్పాటు చేసింది. జిల్లాలో నలుగురితో ఈగిల్ బృందాన్ని ఏర్పాటు చేశారు. అయితే వారికి ఆఫీసు పెట్టాల్సి ఉంది.

- మరింత కఠినంగా చట్టం
- ఎన్‌డీపీఎస్ యాక్ట్ కట్టుదిట్టం
- 20 కిలోలు దాటితే 20 ఏళ్లు
- చిక్కితే నిదాన్‌లో నమోదు
- పాస్ పోర్టూ రాదు
- సహాయం చేసినా 20 ఏళ్లు
- కూటమి ప్రభుత్వ యుద్ధం
- గంజాయిపై ఉక్కుపాదం
- నిర్మూలన దిశగా చర్యలు

ఏవోబీ నుంచి వచ్చేదెలా!

ఈ నెల 4న కొవ్వూరులో 10కిలోల గంజాయితో నలుగురు యువకులు అరెస్టు అయ్యారు. ఈ ఘటన జిల్లాలో గంజాయి తగ్గుముఖం పట్టలేదని రుజువు చేస్తోంది. ఎక్కడో దండకారణ్యంలో సాగవుతున్న గంజాయి ఫారెస్టు, పోలీస్, ఎక్సయిజ్ వాళ్ల కళ్లుగప్పి పట్టణాలు, గ్రామాలకు చేరుతోంది. దీనికి ప్రధాన కారణం ఆయా శాఖల్లోని కొందరు సిబ్బంది లోపాయికారిగా గంజాయి రవాణాకు సహకరిస్తుండడమే అనే అనుమానాలు ఉన్నాయి. అటవీ సంపద అక్రమంగా తరలిపోకుండా ఏజెన్సీ మండ లాల్లో ఫారెస్ట్ చెక్‌పోస్టులు మండలానికి సుమారు 15 వరకూ ఉంటాయి. మారేడుమిల్లి, రాజవొమ్మంగి, చింతూరు, జడ్డంగి తదితర పోలీస్ స్టేషన్లు రోడ్డు పక్కనే చూస్తుంటాయి. కానీ అరకొర తప్ప భారీ తరలింపులు వాటికి కనిపించవు. గతంలో గంజాయి రవా ణాకు సహరిస్తున్న చింతూరు ఎస్ఐ, కానిస్టేబుల్ అరెస్ట్ అయ్యారు.పోలీసులు చూసీ చూడనట్టు వదిలే యడానికి 'ఒప్పందాలు'ంటాయని సమాచారం.

సెంట్రల్ జైలులో 400 మంది

గంజాయి దందాలో అమాయక గిరిజనం జీవితాలు చిత్తవుతున్నాయి.గతంలో ముగ్గురు అమాయక గిరిజన మహిళలు గంజాయితో రాజమహేంద్రవరంలో ఎస్ఈబీ పోలీసులకు పట్టుబడ్డారు. కనీసం వారి కాళ్లకు చెప్పులు కూడా లేవు.ఆ గంజాయిని విజయవాడలో అప్పగిస్తే రూ.2 వేలు చొప్పున ఇవ్వడానికి ఒప్పందం కుదిరింది. గంజాయిని తరలించే క్రమంలో అనుమానం రాకుండా ఉండ డానికి మహిళలను రంగంలోకి దింపుతున్నారు. మరో వైపు అమాయక గిరిజనులు పోలీసులకు పట్టుబడుతూ జైళ్లలో మగ్గిపోతున్నారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో గంజాయి కేసుల్లో 55 మంది శిక్ష అనుభవిస్తుండగా.. 357 మందిపై న్యాయస్థానంలో విచారణ జరుగుతోంది.వీరిలో అధిక శాతం గిరిజనులే ఉన్నారు. అయితే ఎన్‌డీపీఎస్ చట్టంపై గిరిజన గ్రామాల్లో అవగాహన కల్పించకపోవడం,సరైన నిఘా లేకపోవడం వంటివి గిరిజనుల పాలిట శాపంగా మారుతున్నాయనే వాదన ఉంది.

రెండు కేసుల్లో రుజువైతే మరణశిక్ష

కిలో నుంచి 20 కిలోల లోపు గంజాయితో పట్టుబడితే పదేళ్ల వరకూ జైలు, జరిమానా తప్పదు. అంతకంటే ఎక్కువ పరిమాణంలో దొరికితే 20 ఏళ్ల వరకూ జైలు శిక్ష, కనీసం రూ.లక్ష జరిమానా విధించే అవకాశం ఉంటుంది.రెండు సార్లు అంతకు మించిన కేసుల్లో దోషిగా రుజువైతే 30 ఏళ్ల వరకూ జైలు శిక్ష లేదా మరణ దండన కూడా విధించవచ్చు. గంజాయి సాగు, రవాణాకు సహాయం చేసినా 20 ఏళ్ల శిక్ష అనుభవించడానికి సిద్ధంగా ఉండాల్సిందే.గంజాయి ఉత్పత్తి, వ్యక్తి దగ్గర ఉండడం, నిల్వ చేయడం, రవాణా, వినియోగం, అందుకు ప్రయత్నించడం ప్రేరేపించడం అన్నీ నేరాలే.

గతేడాది 65 కేసులు..

తూర్పుగోదావరి జిల్లా పోలీసులు గతేడాది 65 కేసుల్లో 195 మందిని అరెస్టు చేసి సుమారు 3 వేల కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.ఈ ఏడాది ఇప్పటి వర కూ 4 కేసుల్లో 40 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. 22 మందిని నిందితులుగా గుర్తించగా 21 మందిని అరెస్టు చేశారు.సరఫరా చేసిన వాడిని అరెస్టు చేయాల్సి ఉంది.మిగిలిన రెండు జిల్లా ల్లోనూ పరిస్థితి కాస్త అటూ ఇటూగా ఉంది. ఎక్కువగా తూర్పు నుంచే రవాణా ఉంటుంది.

జనార్దనుడి రథోత్సాహం



రాజమహేంద్రవరం రూరల్ మండలం ధవళేశ్వరంలో జనార్దనుడి రథోత్సవం శనివారం వైభవంగా సాగింది..కల్యాణోత్సవాల్లో భాగంగా సాయంత్రం 4 గంటలకు రథం కదలింది.. పెద్ద ఎత్తున భక్తజనం హాజరై నమో జనార్దనాయ అంటూ రథాన్ని లాగారు.. ఆలయం నుంచి కిలోమీటరు దూరం వరకూ భక్తులు రథంపై అరటిపండ్లు విసురుతుండగా ముందుకు సాగింది. ఉదయం మంత్రి కందుల దుర్గేష్ స్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు. - 8లో

జీతాలొచ్చే టైమ్..టార్గెట్!
సహాయం చేస్తామని.. ఏటీఎంల వద్ద మోసాలు

రాజకీయాలు..
వైకుంఠపాళి!
8

రీ సర్వే విధుల్లో నిర్లక్ష్యం.. కలెక్టర్ కొరడా

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : పని చేయని ఉద్యోగులపై కలెక్టర్ పి.ప్రశాంతి కొరడా ఝుళిపించారు.విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న 26 మంది ఉద్యోగులకు శనివారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు.ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.వీరిలో 12 మంది డిప్యూటీ తహశీల్దార్లు, 12 మంది మండల సర్వేయర్లు, ఇద్దరు గ్రామ సర్వేయర్లు ఉన్నారు. క్షేత్రస్థాయిలో రీసర్వే ప్రక్రియను నిర్దిష్టమైన మార్గదర్శకాలు అనుసరించి చేయాలి. కానీ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వారికి కలెక్టర్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు.ఈ మేరకు పెరవలి, గోపాలపురం, రాజమహేంద్రవరం రూరల్, చాగల్లు, గోకవరం, కడియం, దేవరపల్లి, నల్లజర్ల, బిక్కవోలు, కోరుకొండ, సీతానగరం, రాజానగరం మండలాలకు చెందిన 12 మంది డిప్యూటీ తహశీల్దార్లు, 12 మంది మండల సర్వేయర్లకు నోటీసులు జారీ చేసినట్టు కలెక్టర్ తెలిపారు. విధులు, బాధ్యతలు నిర్వర్తించడంలో విఫలమయ్యారని, రీ సర్వే సమస్యల పరిష్కారంలో ఉన్నతాధికారుల సూచనలు పాటించక పోవడం తదితర కారణాలతో షోకాజ్ నోటీసులు జారీ చేశారు. గ్రామ సర్వేయర్లు తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తించడం లేదని.. వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ రాజానగరం మండలం యర్రంపాలెం సర్వేయర్ వి.రమేష్‌కు మార్, కానవరం సర్వేయర్ వై.నాగరాజుకు షోకాజ్ నోటీ సులు ఇచ్చారు.రమేష్ కుమార్ లాగిన్‌లో ఐదు పౌరసేవలు, గంగరాజు లాగిన్‌లో నాలుగు పౌర సేవలు పెండింగ్‌లో ఉన్నాయి. ఇవి జిల్లా పురోగతి మొత్తం మీద ప్రభావం చూపాయని అందువల్ల ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ రూల్స్‌కు లోబడి వివరణ ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు.

- 26 మందికి షోకాజ్ నోటీసులు
- 12 మంది డిప్యూటీ తహశీల్దార్లు
- 12 మంది మండల సర్వేయర్లు
- ఇద్దరు గ్రామ సర్వేయర్లు
- వివరణకు కలెక్టర్ ఆదేశాలు



ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ విజయంపై హర్షం



నిడదవోలులో బీజేపీ నాయకుల సంబరాలు

నిడదవోలు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ ఎన్నికల్లో నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ చారిత్రాత్మక విజయం సాధించిందని పార్టీ పట్టణాధ్యక్షుడు మోర్త ప్రమోద్‌కుమార్ అన్నారు. ఈ నేపథ్యంలో శనివారం నిడదవోలులోని గణేష్‌చౌక్ సెంటరులో బీజేపీ నాయకులు సంబరాలు చేసు కున్నారు. కేక్ కట్ చేసి బాణసంచా కాల్చి మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా ప్రమోద్‌కుమార్ మాట్లాడుతూ ఢిల్లీలో బీజేపీ విజయం నాయకులు, కార్యకర్తల సమష్టి కృషి అని అన్నారు. కేజ్రీవాల్‌పై గెలుపొందిన సింగ్ వర్మకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు సీహెచ్‌బీ వెంకటే శ్వరరావు, మోర్త బాలవినోద్, ముదునూరి కిషోర్‌రాజు, బండి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మంచికి మద్దతిచ్చారు: నాగేంద్ర



కొవ్వూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ రాష్ట్రాన్ని అవినీతిమయం చేసిన కేజ్రీవాల్ పాలనను ప్రజలు అంతం చేశారని, చెడును వదిలి మంచికి మద్దతిచ్చారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర న్నారు. ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఓటర్లు దేశ ప్రయోజనాలు, రాష్ట్రాభివృద్ధి కోసం ఆలోచించారన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో ఢిల్లీ అభివృద్ధి చెందుతుందన్న నమ్మకంతో ఓటేశారన్నారు. బీజేపీ పాలనలో రాష్ట్రంలో సంపూర్ణ అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ ఎన్నికల్లో కష్టపడిన ప్రతి కార్యకర్తకు అభినందనలు తెలియజేశారు.

కోటసత్తెమ్మ ఆలయంలో హైకోర్టు రిటైర్డ్ జడ్జి పూజలు



కోటసత్తెమ్మ ఆలయంలో రిటైర్డ్ జడ్జి శివ శంకర్‌కు వేదాశీర్వచనాలు ఇస్తున్న పండితులు

నిడదవోలు/కొవ్వూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో కోటసత్తెమ్మ ఆలయంలో శనివారం రిటైర్డ్ హైకోర్టు జడ్జి బులుసు వాగ్నేశ్వర్ శివ శంకర శర్మ, ప్రముఖ సిద్ధాంతి ప్రక్కి వీరభద్రరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇద్దరికీ ఆలయార్చకుడు అప్పా రావు శర్మ వేద ఆశీర్వచనాలు అందజేశారు. వారి వెంట ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెం బర్ దేవులపల్లి రవిశంకర్ తది తరులున్నారు. అలాగే కొవ్వూరు శ్రీనివాస స్నాన ఘట్టంలోని ప్రకృతి రావణ బ్రహ్మ శి వాలయ ప్రాంగణంలో సూర్య ఉపాసకుడు విక్రమాదిత్య ఆధ్వర్యంలో జరుగుతున్న మహా సౌరయాగం 10వ రోజు కార్యక్రమంలో రిటైర్డ్ జడ్జి శంకర శర్మ పాల్గొన్నారు. ఆయనకు ఆలయ కమిటీ చైర్మన్ అనపర్తి శివ రామకృష్ణ ఘన స్వాగతం పలికి సత్కరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీఅక్క దేవతల ఉత్సవం



బీమోలులో అక్కదేవతల అమ్మవార్లను దర్శించుకుంటున్న భక్తులు

గోపాలపురం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): బీమోలు గ్రామంలో శ్రీఅక్క దేవతల ఉత్సవం శనివారం ఘనంగా జరిగింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఈ సందర్భంగా అమ్మవార్లను దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం జరిగిన అన్నసమారాధనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా కుమారదేవం గ్రామానికి చెందిన శ్రీఅనంత భోగేశ్వరస్వామి పాలభక్తుల మండలి చేసిన కోలాటం ఆకట్టుకుంది. మాజీ సర్పంచ్ గం ధ్రోతు శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగి ఈ ఉత్సవ ఏర్పాట్లను కమిటీ సభ్యులు వింటి సత్యనారా యణ, వింటి శ్రీను, కొండయ్య, కోడే సత్యనారా యణ, ఇంటి సత్యనారాయణ, ఇంటి దుర్గారావు, మధ్యాహ్నాపు భద్రం, పర్యవేక్షించారు.

చాగల్లులో వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం



పూజల్లో పాల్గొన్న బ్రహ్మంగారి 8వ తరం మునిమనవడు వీరభద్రస్వామి దంపతులు

చాగల్లు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) స్థానిక శ్రీకామాక్షి, శ్రీగోవిందమాంబ సమేత శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామికి కుంభాభిషేకం, ప్రత్యేక పూజలు, కల్యాణం వేడుకగా జరిగాయి. బ్రహ్మం గారి 8వ తరం మునిమనవడు వీరభద్రస్వాములు, మాతా లక్ష్మీభ్రమరాంబిక దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఆదివారం స్వామి వారి ఊరేగింపు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. చాగల్లు, నెలటూరు విశ్వబ్రాహ్మణ సంఘం, పురజనుల ఆధ్వర్యంలో పూజలు జరుగుతున్నాయి. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణాన్ని తిలకించారు.

టెనెక్ట్‌ప్లస్ ఇంజెక్షన్‌తో గుండెకు భరోసా



కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిలో అవగాహన కల్పిస్తున్న డాక్టర్లు సాయికిరణ్, సత్యకుమారి

కొవ్వూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): టెనెక్ట్‌ప్లస్ ఇంజెక్షన్‌తో గుండెకు భరోసా కల్పించవచ్చని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంటు డాక్టర్ కె.సాయికిరణ్ అన్నారు. కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిలో శనివారం టెనెక్ట్‌ప్లస్ ఇంజెక్షన్‌లపై ఆసుపత్రికి వచ్చిన రోగులకు, బంధువులకు అవగాహన కల్పించారు. సాయికిరణ్ మా ట్లాడుతూ గుండెపోటుకు గురైన వ్యక్తిని గోల్డెన్ అవర్(గంట లోపు) ఆసుపత్రికి తీసుకొస్తే ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చునన్నారు. టెనెక్ట్‌ప్లస్ ఇంజెక్షన్లు ప్రభుత్వాసుపత్రిలో అందుబాటులో ఉన్నాయన్నారు. జనరల్ ఫిజీషియన్ డాక్టర్ సత్యకుమారి మాట్లాడుతూ ఛాతీ నొప్పి, చెమటలు పట్టడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, వికారం, వాంతులు, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గరలోని ఆసుపత్రికి తరలించి వైద్యం పొందాలన్నారు. అనంత రం టెనెక్ట్‌ప్లస్ ఇంజెక్షన్లపై అవగాహనకు పురవీధుల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. దొమ్మేరు పీహెచ్‌సీలో టెనెక్ట్‌ప్లస్ ఇంజక్షన్లపై వైద్యాధికారి డాక్టర్ ఎస్.ధర్మరాజు అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

లారీ ఢీకొని చెరకు ట్రాక్టర్ బోల్తా



కరిచర్లగూడెం-జగన్నాథపురం రోడ్డులో బోల్తా పడిన చెరకు ట్రాక్టర్

గోపాలపురం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై కరిచర్లగూడెం-జగన్నాథపురం గ్రామాల మధ్య లారీ ఢీకొనడంతో చెరుకు ట్రాక్టర్ బోల్తా పడింది. స్థానికులు వివరాల ప్రకారం.. శని వారం నిడదవోలు మండలం త్యా జంపూడి నుంచి జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి చెరుకు ఫ్యాక్టరీకి చెరుకు లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొని కొంతదూరం ఈడ్చుకె ళ్లడంతో బోల్తా పడింది. ట్రాక్టర్ డ్రై వర్ లంకలో పడిపోయాడు. లారీ డ్రైవర్ లారీతో సహా పరారుకాగా ట్రాక్టర్ డ్రైవర్ ద్విచక్రవాహనంపై వెళ్లి కొయ్య లగూడెం సమీపంలో లారీని పట్టుకున్నాడు. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు.

కొవ్వూరులో ట్రాక్టర్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

కేసు నమోదు

కొవ్వూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ ఢీకొని ఓ వ్యక్తికి గాయాలైనట్టు ఎస్ఐ కె.జగన్మోహనరావు తెలిపారు. ధవళేశ్వరం గ్రామానికి చెందిన పొన్నాడ శ్రీను ఈ నెల 5న బైక్‌పై పట్టిసీమ వెళ్తుండగా కొవ్వూరులోని ఆరికిరేవుల రోడ్‌లో ఆక్సిజన్ ప్లాంట్ సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీను చేతులు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతడిని రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఆసుపత్రి సమాచారం, పొన్నాడ శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా భీష్మ ఏకాదశి

» వెంకన్న, విష్ణు ఆలయాలకు పోటెత్తిన భక్తులు

» దేవాలయాల్లో ప్రత్యేక పూజలు



దేవరపల్లిలో శ్రీలక్ష్మీనారాయణ శాంతి కల్యాణం



కొవ్వూరులో విశేష అలంకరణలో వేంకటేశ్వరస్వామి



తీపర్రులో లక్ష్మీనరసింహస్వామికి పూజలు

పెరవలి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): అంతిర్వేది ఏకాదశి సందర్భంగా శనివారం మండలంలోని వేంకటేశ్వరస్వామి, విష్ణు ఆలయాల్లో భక్తులు దైవ దర్శనం చేసుకున్నారు. ఉదయాన్నే స్నానాలు ఆచరించి ఆలయాలను దర్శించారు. ఏకాదశి శనివారం రావడంతో అన్నవరప్పాడు వేంకటే శ్వరస్వామి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. ఈ సందర్భంగా జరిగిన అన్నసమారాధనకు ఏలూరు జిల్లా సహకార ఆడిట్ అధికారి ఆరిమిల్లి శ్రీనివాస్, శారదా దంపతులు సహకారం అందించారు. అలాగే తీపర్రులో లక్ష్మీ నరసింహస్వామి, కాకరపర్రులో వేణుగోపాల స్వామి ఆలయాలతోపాటు కానూరు, పెరవలి, ముక్కామల, ఖండవల్లి గ్రామాల్లోని పలు ఆలయాలను భక్తులు దర్శించుకున్నారు.

దేవరపల్లి: భీష్మఏకాదశి సందర్భంగా మండలంలోని అన్ని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. దేవరపల్లిలో సాయిబాబా ఆలయ వార్షికోత్సవం, భీష్మఏకాదశి సందర్భంగా ఆలయం వద్ద లక్ష్మీనారాయణ శాంతి కల్యాణం, ప్రత్యేకహోమాలు నిర్వహించారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిపారు. అలాగే బాలదుర్గమ్మ, స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయాల వద్ద ప్రత్యేకపూజలు, భజనలు ఏర్పాటు చేశారు. ఆయా దేవాలయాలను తెల్లవారు జాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు: స్థానిక బసివిరెడ్డిలో కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు గొడవర్తి వేణుగోపాలచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ దేవగుప్తాపు లక్ష్మణరావు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శాత్తుమ్రై సేవ, సహస్రనామార్చన, తీర్థ ప్రసాద వితరణ విష్ణు సహస్ర నామ స్తోత్రం పారాయణం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండల కేంద్రమైన ఉండ్రాజవరంలోని నూతనంగా నిర్మించిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు పలు గ్రామాల నుంచి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే మండలంలోని పలు వెంకటేశ్వరస్వామి ఆలయాలు వద్ద పూజలు నిర్వహించారు.

శ్రీవారి చక్రస్నానం

రాజమహేంద్రవరం కల్చరల్,ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి):స్థానిక సింహాచలనగర్ శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి క్షేత్ర చందన యాత్ర మహోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం శ్రీవారి చక్రస్నానం కార్యక్రమం జరిగింది. ధర్మకర్త కాలెపు నాగేశ్వరరావు పర్యవేక్షణలో ఆలయార్చకుల మంత్రోచ్ఛారణతో ఆలయ ఆవరణలోని కోనేరులో చక్రస్నానం నిర్వహించారు.

రాజశేఖర్‌ను గెలిపించండి

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యేలు మద్దిపాటి, ముప్పిడి



కృష్ణంపాలెంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

దేవరపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్ ఓటర్లు తమ మొదటి ప్రాధాన్య ఓటును ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. ఈ మేరకు శనివారం మండలంలోని కృష్ణంపాలెం, సుబ్బరాయపురం గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అలాగే సుబ్బరాయపురంలో ఇటీవల అగ్నిప్రమాదంలో మూడిళ్లు దగ్ధం కావడంతో బాధితులను కలిసి ఇళ్ల నిర్మాణానికి సహాయ సహకారాలు అందిస్తామ ని హామీ ఇచ్చారు. కార్యక్ర మంలో నాగరాజు, పెనుమత్స సుబ్బరాజు, ఉప్పులూరి రాం బాబు, యాగంటి వెంకటర త్నం, కంబాల సత్తిబాబు, జాజిమొగ్గల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొవ్వూరు: ఎమ్మెల్సీ ఎన్నికల కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మద్దతుగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కొవ్వూరులో ప్రచారం నిర్వహించారు. స్థానిక హోలీ ఏంజిల్స్ పాఠశాలలో ఉపాధ్యాయులను కలిసి కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం శ్రీ అభ్యాస పాఠశాల, కుమారదేవం గ్రామంలో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులంతా రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్య ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ రామారావు, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, బోడపాటి ముత్యాలరావు, పెనుమాక జయరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై గొంతెత్తేది పీడీఎఫ్ ఎమ్మెల్సీలే

ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అధికార, ప్రతిపక్షాల్లో చేరకుండా ప్రజాసమస్యల పరిష్కారంలో గొంతెత్తి నినదించేది పీడీఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రమే అని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం రాజమహేంద్రవరంలోని ఆనం రోటరీ హాలులో ప్రజాసంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ఉభయగోదావరి జిల్లాల పీడీఎఫ్ పట్టభద్రుల అభ్యర్థి డీవీ రాఘవులు పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు వంతపాడడంతో నిరుద్యోగులు, పేదలు, నిమ్న వర్గాలు ఉపాధి అవకాశాలులేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని విమర్శించారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ డీఎస్సీ నియామకాల కోసం ఎన్నికల్లో మాటిచ్చినా నేటికీ అతీగతీలేదని అన్నారు. కుంటిసాకులు చెబుతూ డీఎస్సీ వాయిదా వేస్తున్నారని ఆరోపించారు. విజన్-2047 అంటూ కార్పొరేట్లకు లబ్ధి చేకూరేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు సంబంధించి సీపీఎస్ రద్దు, ఓపీఎస్ అమలు, నూతన పీఆర్‌సీ కమిటీ ఏర్పాటు వంటి సమస్యలపై కూడా ప్రభుత్వం ఉదాసీన వైఖరి ప్రదర్శిస్తోందని ఐవీఆర్ అన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి రాఘవులు మాట్లాడుతూ తనను గెలిపిస్తే ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి టి.అరుణ్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు ఎన్.అరుణకుమారి, జ్యోతిబసు, కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మాణిక్యం మాట్లాడారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.జయకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా నాయకుడు జువ్వల రాంబాబు, జేఏసీ జిల్లా నాయకుడు ప్రవీణ్, అంగన్వాడీ రాష్ట్ర నాయకురాలు బేబీరాణి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి షరీఫ్, సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఏమార్చి సొమ్ములు స్వాహా

» ఏటీఎంల వద్ద సహాయం పేరుతో మోసాలు

» ఇద్దరు నిందితుల అరెస్ట్

» 23 ఏటీఎం కార్డులు స్వాధీనం



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ రమేశ్‌బాబు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఏటీఎంల వద్ద సహాయం పేరుతో కార్డుదారులను ఏమార్చి సొమ్ము స్వాహా చేస్తున్న ఇద్దరు అంతర్ జిల్లా కేటుగాళ్లకు ప్రకాశంనగర్ పోలీసులు చాకచక్యంగా చెక్ పెట్టారు. సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.రమేశ్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల ఏటీఎంల వద్ద మోసాలు ఎక్కువగా జరుగుతుండడంపై ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాలతో సీఐ ఆర్ఎస్‌కే బాజీలాల్ నేతృత్వంలో ఎస్ఐ ఎస్.శివ ప్రసాద్, క్రైం పార్టీ పీసీలు కె.ప్రదీప్‌కుమార్, ఎస్.వీరబాబుతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి నిఘా పెట్టారు. సుమారు 80 సీసీ కెమెరాల విశ్లేషణ అనంతరం ఏటీఎంల వద్ద కార్డు వినియోగించడంపై అవగాహన లేనివారినే లక్ష్యంగా చేసుకొని మోసాలకు పాల్పడుతున్న విజయనగరం జిల్లా పురిటి పెంటకు చెందిన చల్లమూరి వెంకట భాస్కర రావు, పొన్నాడ కిరణ్‌లను నిందితులుగా గుర్తించారు. వీళ్లు ప్రతి నెలా జీతాల సమయమైన 1 నుంచి 8వ తేదీ వరకూ మాత్రమే.. అదీ జన సమ్మర్థం పెద్దగా ఉండని మధ్యాహ్నం వేళల్లో ఏటీఎం వద్దకు చేరుకుంటారు. ఏటీఎం వినియోగం రానివారి వద్ద మంచి వాళ్లుగా నటిస్తారు. కార్డును స్లాట్‌లో పెట్టి కార్డుదారుడు పిన్ నెంబరు చెప్పిన తర్వాత డబ్బులు తీస్తున్నట్టు ప్రయత్నిస్తారు. ఏటీఎం పని చేయడం లేదు. డబ్బులు రావడం లేదని చెబుతారు. తిరిగి కార్డుదారుడికి కార్డు ఇచ్చే సమయంలో క్షణాల్లో వేరే కార్డును చేతిలో పెడతారు. అతడు వెళ్లిన వెంటనే పిన్ నెంబరు అప్పటికే తెలుసు కాబట్టి డబ్బులు డ్రా చేసి ఉడాయిస్తారు. ప్రతి నెలా 8వ తారీఖు తర్వాత ఇంటి వద్దే ఉంటూ కిరాణా కొట్టు నడుపుకుంటారు. దోచుకున్న డబ్బులను వీళ్లు ఆన్‌లైన్‌లో బెట్టింగులకు వాడుకుంటారు. వీళ్లపై ప్రకాశంనగర్ పీఎస్‌లో 3, రాజమహేంద్రవరం 2టౌన్, రాజానగరం, రావులపాలెం, ఏలూరు 3టౌన్‌లో ఒక్కోటి, విజయనగరం, విశాఖ, పెందుర్తి, విజయవాడ, భీమిలిలో 15 కేసులు ఉన్నాయని డీఎస్పీ పేర్కొన్నారు. నిందితుల వద్ద నుంచి 23 ఏటీఎం కార్డులు, రూ.2.06లక్షల నగదు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నామని సీఐ బాజీలాల్ తెలిపారు. ఏటీఎంల వద్ద ఆదమరుపుగా ఉండొద్దని, అపరిచితుల చేతికి కార్డు ఇవ్వకుండా జాగ్రత్త వహించాలని ఆయన సూచించారు. కార్డుదారులకు ఏదైనా అనుమానం వస్తే వెంటనే పోలీసులకు లేదా బ్యాంకు సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. కేసు ఛేదనలో ప్రతిభ చూపిన సీఐ బాజీలాల్ బృందాన్ని ఎస్పీ నరసింహ కిషోర్ ప్రత్యేకంగా అభినందించారు. కాగా.. ఏటీఎం కార్డులను వినియోగించడం చాలా మందికి తెలియదు. చాలా ఏటీఎంల వద్ద సహాయం చేయడానికి కనీసం సెక్యూరిటీ గార్డు కూడా ఉండరు. బ్యాంకు సిబ్బంది సహాయం చేయరు. ఇదే ఆసరాగా మోసాలు జరుగుతున్నాయనడంలో సందేహం లేదు. ఏటీఎం కార్డులపై కార్డుదారుడి ఫొటో ఉంటే చాలా వరకూ ఇలాంటి మోసాలకు అడ్డుకట్ట వేసే అవకాశం ఉంటుంది.

ముందర దొంగలున్నారంటూ..

చెవి దిద్దులు దోపిడీ.. ఆటో డ్రైవర్ అరెస్టు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మహిళను ఏమార్చి చెవి దిద్దులు దొంగిలించిన ఆటో డ్రైవర్‌ను ప్రకాశంనగర్ పోలీసులు అరెస్టు చేశారు. డీఎస్పీ కె.రమేశ్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. నామవరం బీ బ్లాక్‌కు చెందిన చొల్లంగి విజయకుమార్ ఆటో నడుపుతుంటాడు. రాజేంద్రనగర్‌కి చెందిన ఓ మహిళ ఈ నెల 1న రాత్రి 7గంటల సమయంలో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఆ ఆటో ఎక్కారు. కొంత దూరం వెళ్లిన తర్వాత ఆ దారిలో దొంగతనాలు జరుగుతున్నాయని, ఒంటిపై బంగారు వస్తువులు దాచుకోవాలని ఆమెతో విజయకుమార్ చెప్పాడు. ఆమె వాటిని కాగితంలో చుట్టి బ్యాగ్‌లో పెడుతున్న సమయంలో దొంగిలించి ఆమెను ఘటనా ప్రదేశంలో వదిలేసి వెళ్లిపోయాడు. దీనిపై ఆమె అదే రోజున ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. సీఐ ఆర్ఎస్‌కే బాజీలాల్ నేతృత్వంలో ఎస్ఐ శివప్రసాద్, హెచ్‌సీ ఎన్.రాంబాబు, క్రైం పార్టీ పీసీలు కె.ప్రదీప్ కుమార్, ఎస్.వీరబాబుతో ఎస్పీ నరసింహ కిషోర్ ప్రత్యేక పోలీసు బృందాన్ని ఏర్పాటు చేశారు. దర్యాప్తులో విజయ్‌కుమార్‌ను నిందితుడిగా గుర్తించి అరెస్టు చేశామని డీఎస్పీ వివరించారు. ఆమె నుంచి దోచుకున్న 4గ్రాముల చెవిదిద్దులు, నేరానికి వినియోగించిన ఆటోను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిపై 2019లో బొమ్మూరు పోలీసుస్టేషన్లో కేసు ఉందన్నారు. వాహనాల్లో ప్రయాణించే సమయంలో పరిచయం లేని వ్యక్తులతో జాగ్రత్తగా వ్యవహరించాలని సీఐ బాజీలాల్ సూచించారు. ఏదైనా అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

రజకుల సంక్షేమానికి కృషి

బల్లల పండుగలో మంత్రి దుర్గేష్



మంత్రి దుర్గేష్‌ను సత్కరిస్తున్న దృశ్యం

నిడదవోలు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రజకుల సంక్షేమానికి, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు రజకుల వీధిలోని కమ్యూనిటీ హాలులో శనివారం జరిగిన బల్లల పండుగలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, నాయకులు రంగా రమేష్, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, కౌన్సిలర్ కారింకి నాగేశ్వరరావు, షకీరా బేగం, తిరుపతి సత్యనారాయణ పాల్గొన్నారు.

రాజకీయాలు..వైకుంఠపాళి

» ఎవరిని ఎప్పుడు ఏ నిచ్చెన ఎక్కిస్తాయో తెలీదు

» అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు



రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలు వైకుంఠపాళి లాంటివని అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు అన్నారు. ఎవరిని ఎప్పుడు ఏ నిచ్చెన ఎక్కించి పైకి నిలుపుతాయో, ఎవరిని కిందకు దింపుతాయో తెలియదు అని వ్యాఖ్యానించారు. శనివారం రాత్రి రాజమహేంద్రవరంలోని హోటల్ మంజీరలో పార్లమెంట్ సభ్యుడు సీఎం రమేష్, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబులకు ఆత్మీయ సత్కార సభ జరిగింది. నగర ప్రముఖులు ఎం.కేశవరాజు, బి.నరసింహరావు, వారి మిత్రబృందం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రఘురామకృష్ణంరాజు విచ్చేసి మాట్లాడుతూ రాజకీయాలంటే వైకుంఠపాళి మాదిరిగానే ఉంటాయన్నారు. ఇద్దరూ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని కోరుకుంటున్నానన్నారు. సీఎం రమేష్ ఎక్కడుంటే ఆ పార్టీకి అదృష్టం వరిస్తుందన్నారు. తమకు జరిగిన ఆత్మీయ సత్కారానికి సీఎం రమేష్, సానా సతీష్‌బాబు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రమేష్, సతీష్‌బాబు దంపతులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, పితాని సత్యనారాయణ, బండారు సత్యానందరావు, కేవీపీ రామచంద్రరావు, బీజేపీ నాయకులు సోము వీర్రాజు, ఉండవల్లి అరుణ్‌కుమార్, ఇతర రాజకీయ, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

కాగా, ఈ సభలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన రాజకీయ నాయకుడు కరాటం రాంబాబు మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులను ఆదుకోవాలని కోరారు. ఎంపీ రమేష్, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ ఇద్దరూ కేంద్రం నుంచి నిధులు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై వారిద్దరూ సానుకూలంగా స్పందిస్తూ పోలవరం నిర్వాసితులను ఆదుకోవడానికి కృషి చేస్తామన్నారు.

క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి

జడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి



నల్లజర్ల, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ పాఠశాలలు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని జడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు అన్నారు. నల్లజర్ల భాష్యం స్కూల్లో నిర్వహించిన ఇంట్రా జోనల్ స్పోర్ట్స్ మీట్ శనివారంతో ముగిసింది. వివిధ క్రీడాంశాల్లో విజయం సాధించిన వారికి బాపిరాజు ట్రోఫీలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటమి మరో విజయానికి నంది పలుకుతుందన్నారు. ప్రస్తుత రోజుల్లో విద్యార్థులు కంప్యూటర్లు, సెల్‌ఫోన్లలో రీల్స్, సినిమాలపై మక్కువ చూపిస్తు కాలం గడుపుతున్నారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవై రాజు, కోరా కన్నయ్య పాల్గొన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్ స్క్రీన్1	: తండేల్
వై.స్క్రీన్2	: సంక్రాంతికి వస్తున్నాం
అనన్య	: పట్టుదల

నిడదవోలు

వీ మ్యాక్స్	: మదగజరాజు
రాధాకృష్ణ	: సంక్రాంతికి వస్తున్నాం
శ్రీగణపతి	: డాకు మహరాజ్

దేవరపల్లి

శ్రీరామ్‌నాథ్	: గేమ్ ఛేంజర్
త్రినాథ్	: డాకూ మహరాజ్